# మంచి మనిషి

ఆ పడి పోయిన మనిషికి వడదెబ్బ తగిలిందేమో ఇన్ని చల్లని మంచినీళ్ళయినా గొంతులో పోద్దామని ఏ ఒక్కరికీ తోచలేదు. తోచక పోవడం కాదు బుద్ధి పుట్టలేదు. బుద్ధి పుడుతే మంచినీళ్ళేం కర్మం ఇన్ని మజ్జిగ నీళ్ళు పొయ్యవచ్చు. అక్కడ చాలామంది ఇళ్ళల్లో కాద్దో గొప్పో పాడి ఉన్నది. ఎంత ఎండాకాలమైనా ఏ యింటికి వెళ్ళి అడిగినా ఇన్ని మజ్జిగ పొయ్యకపోరు. అటువంటి ఆలోచన ఎవరికీ రాలేదు. చూద్దానికైతే అక్కడకు చాలా మందేచేరారు ఒకరితర్వాత ఒకరు. అంతా తలకొక మాట తలకొక తీరున అనడమే కాని ఎవరూ మరో విధంగా ఆలోచించిన పాపాన పోలేదు.

"దొంగ వెధవ అందరికీ ఎగవెయ్యటమే! చూస్తుండగానే కళ్ళల్లో కారం కొడతాడు. అలా ఎన్ని సార్లు ఎంతమందిని దగా చేశాడో! ఎంత మందికి ద్రోహం చేశాడో! పాపం పండింది. మురికి వెధవ - చావనీయండి మరేం ఫర్వాలేదు. ఇటువంటివాడు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. చావొస్తే మంచిది వాడికి. వీడు చస్తే జనాభా కేమీ లోటు లేదు. పోనీండి_భూదేవికి భారం తగ్గుతుంది_వెధవ_వెధవ!" అంటూ చేతిలో మునివేళ్ళతో నలుపుతూ గుండ్రంగా త్రిప్పుతున్న లంక పొగాకు చుట్టను ఒకసారి నోట్లో పెట్టుకొని. చుట్ట చివరి కొసను కొరికి "థూత్" అని దూరంగా ఉమ్మేసి చేతిలో ఉన్న అందమైన పొన్ను కర్ర ఆడిస్తూ నలువైపులా హుందాగా చూస్తూ ముందుకు సాగివెళ్లాడు ఆఊరి మోతుబరి రైతు వెంకట్రామయ్య. ఆయనకు ఆ ఊరి మునసబు

గిరీ కూడా ఉన్నదేమో మరీ ఠీవిగా నడిచి వెళ్ళాడు. కిర్రు చెప్పులు చప్పుడు చేసుకొంటూవెళ్ళాడాయన. ఐశ్వర్యంతో పాటు"ఉన్నతపదవి" కూడా ఉన్నందుకు ఆయనకు లోపల ఎంతో గర్వం.

ఆయనకంటె రెండాకులు ఎక్కువ చదివాడు ఆయన పెద్దకొడుకు సంగమేశ్వరరావు. తండ్రి వెళ్ళాక ఒక అడుగు ముందుకు వేసి అటు ఒక క్షణం పరిశీలనగా చూచి "ఒళ్ళు చూశారర్రా—చీడ—భయంకరమైన రోగంలాగుంది. దగ్గరగా నిలబడితేనే చాలు—అటు గాలి ఇటు సోకితేనే చాలు—ఈరకం రోగాలు ఇవతల వాళ్ళకు అంటుకొంటాయి. ఇటువంటి రోగాల వాళ్ళను ఆసుపత్రుల్లో కూడా దూరంగా షెడ్డుల్లో పడేస్తారు-- దూరంగా ఉండండి—"అని హెచ్చరించాడు—ఇస్త్రీ చొక్కాపై పడిన సిగరెట్టు నుసి దులుపుకొంటూ. ఆ గ్రామంలో రోజూ మంచి ఖరీదైన ఇస్త్రీ బట్టలు వేసి "షోగ్గా" తిరిగే ఒక జట్టుకు అతను నాయకుడు. యువజన సాంస్కృతిక సంఘం అని బయట బోర్డు పెట్టి లోపల చీట్ల పేక క్లబ్బు ఏర్పాటు చేసేందుకు అతను పథకాలు వేస్తున్నాడు. తనకూ తన బృందం సభ్యులకూ ఉపయోగకరంగా ఉండేందుకుగాను అక్కడ లాండ్రీ "షాపు, క్షౌరశాల" ఏర్పాటు చెయ్యాలని కూడా అతను ఆలోచిస్తున్నాడు. ఆ గ్రామంలో నవనాగరికులలో అగ్రతాంబూలం అతనిదే. రాత్రంతా బస్తీలో రకరకాల కాలక్షేపం కోసం పచ్చనోట్లు మార్చేస్తూ తిరిగి వచ్చి పగలంతా—స్వగ్రామంలో పెద్ద లంకంత సొంత ఇంట్లో సుష్టుగా తిని—హాయిగా నిద్ర పోయి సాయంకాలం కావస్తుండగా నిద్ర లేచి ఫలహారం, కాఫీ చెల్లించి అందరి ఎదుటనే సిగరెట్లు తాగుతూ బయటకు వచ్చి మిత్ర బృందంతో షికారుకు బయలుదేరినవాడు ఆ గుంపును చూచి ఒక క్షణం ఆగి, చుట్టూ చేరిన మనుష్యులను తోసుకొని వెళ్ళి ఆ మనిషిని గుర్తుపట్టి "ఛీ ఛీ వెధవ దృశ్యం - ప్రొద్దున్నే ఎవరి మొహం చూశానో—ఛీ."అంటూ ఛీత్కారం చేసి, ఊరివారి మేలు

కోరి "అల్లా చోద్యం చూస్తున్నా రేమర్రా—పొండి అవతలకు దూరంగా తొలగిపొండి. పాడు రోగాలూ వాడూ—" అని హెచ్చరికలు చేసి యువ తరానికి మార్గ దర్శకత్వం వహించి ముందుకు నడిచాడు. ఇనపనాడాలు కొట్టిన బెల్టు బూట్లు పెద్దగా చప్పుడు చేసుకొంటూ వెళ్ళాడతను.

మునసబుగారి పెద్ద కొడుకు—కొంత కాలం బస్తీలో చదువుకొని వచ్చినవాడు. 'ప్రపంచజ్ఞానం' కలవాడు. అందులోనూ ఆసుపత్రులూ రోగాల వంటి విషయాలు అనుభవ పూర్వకంగా తెలిసినవాడు. అలా హెచ్చరించే సరికి మిగిలిన వాళ్ళకు నిజంగానే భయం వేసింది. ఆయన కంటె మన కెక్కువ తెలుసా? లేనిపోని తద్దినం కోరి తెచ్చుకోవడం దేనికీ.అనుకొని ఎవరిమట్టుకు వారు నెమ్మదిగా జారుకొన్నారు. చివరకు జారుకొన్న వాళ్ళల్లో ఒకరిద్దరికి కొంచెం మనస్సులో "పాపం" అని పించింది.

అందుకే మరోక్షణం ఆగారు. మునసబుగారి కొడుకు ఎన్నిసార్లు బస్తీకి వెళ్ళి రహస్యంగా ఔషధసేవ చెయ్యలా- భయంకరమైన సుఖ వ్యాధులే నయం కాగా లేంది వీడికి పట్టిన 'చీడ' మందు తింటే పోదా- తీసుకొని వెళ్ళి ఏఆసుపత్రిలో అయినా పడేస్తే బాగుండు"అనుకొన్నారు. కాని ఆ పని తాము చెయ్యడం బాగా లేదనిపించింది. "మనకెందుకీ గొడవ. ఎవడి ఖర్మ వాడు అనుభవించవలసిందే" అనుకొంటూ ఏదో గొణుక్కొంటూ వారూ తమకు ముందు వెళ్ళిన వారినే అనుసరించారు. అందులో ఒకాయన "వెధవ ప్రపంచం—వెధవ మనుష్యులూనూ"అంటూ పెద్దగా ఏమిటేమిటో తిట్టిపోస్తూ వెళ్ళాడు. రెండో వ్యక్తి "ఇచ్ఛ్ ఇచ్ఛ్" అనుకొంటూ, ఏదో గొణుక్కొంటూ నెమ్మదిగా వెనక్కు తిరిగి చూస్తూ వెళ్ళాడు. రెండో వ్యక్తి మనస్సులో కొన్ని ఆలోచనలు మెదిలాయి.

"ఎవరికో ఎప్పుడో డబ్బు ఎగవేశాడని మధ్యనాకెందుకు

కోపం ! ఎందు కింత పగ ! అయినా కోపగించి బుద్ధి చెప్పడానికి ఇదా సమయం ? ఎప్పుడు పడిపొయ్యాడో ఏమో పాపం" అనుకున్నాడు. ఇంటికి వెళ్ళి పాలేరును పంపి సాయం చేద్దామనుకొన్నా డాయనలోపల. కాని. పదిమందీ ఎలా చేస్తే అలా చెయ్యడం మంచిది అనుకొంటూ వెళ్ళాడు. ఆయన దారి పొడుగూతా ఆలోచిస్తూనే ఉన్నాడు "డబ్బు కొందరికి ఎగవేసిన మాట నిజమే. పట్టుపడ్డాడు కనుక – ఎగవెయ్యడం చేత కాదు కనుక వీ డిలా పాడయ్యాడు. మునసబుగారు ఎంతమందికి డబ్బు ఎగవెయ్యలా ? పాతనోట్లు తిరగవ్రాయించేటప్పుడు ఎన్ని రకాల మోసాలు చెయ్యలా. ఎన్ని విధాల ఎంత మందిని మోసంచేసి ఎందరి ఆస్తులు కలుపుకోలా - కాని వీడు దరిద్రుడు కనుక తిట్టి పోస్తున్నాం..." అలా సాగింది ఆయన ఆలోచన.

మొదట చేరిన వాళ్ళు జారుకొన్న పది నిముషాల తర్వాత మళ్ళీ మనుష్యులు అక్కడ గుమిగూడారు.

మళ్ళీ మాటలూ, తిట్లూ. పూర్వగాథలు త్రవ్విపొయ్యడం ప్రారంభ మయ్యాయి.

"బుచ్చెయ్యరా – దొంగ వెధవ.

రెండు సార్లు జైలుకు పోయి వచ్చాడు.

అయినా ఒక్క రవ్వ కూడా బుద్ధి రాలేదు.

పెళ్ళాం బిడ్డలను పొట్టను పెట్టుకొన్నాడు.

నిర్భాగ్యుడు.

దౌర్భాగ్యుడు.

ఆస్తి అంతా అమ్ముకొన్నాడు.

వెధవ–తాగుబోతు వెధవ.

వెధవ – దరిద్రపు వెధవ.

నీచుడు – పరమ నీచుడు.

పాపం పండింది.

తను చేసిన పాపమే ఎదురు తిరిగి చెంపదెబ్బ కొట్టింది. ఎవరి ఉసురు కొట్టిందో! అవును మరి చేసిన పాపం ఊరికెనే పోతుందా! అందుకే వెధవ పాడు రోగాలతో తీసుకొంటున్నాడు. నిజంగా పడిపో య్యాడో ఇదంతా నటనో ! పోనీ చావనీయండి.

చెడేవాణ్ణి బాగు చెయ్యలేం.

అయినా చచ్చేవాణ్ణి మనం అడ్డుకోగలమాఏమిటి ?

ఒకవేళ ఈ వెధవ మన ఉళ్ళో చస్తాడేమో.

చందాలు మనం ఇవ్వవలసి వస్తుంది కాబోలు ఖర్మం."

ఆరోజు మధ్యాహ్నం రెండుగంటల వేళ బుచ్చెయ్య మూలుగుతూ తూలుతూ వచ్చాడు రామాపురం. రామాపురానికి అతని స్వగ్రామం రెడ్డి పాలెం రెండు మైళ్ళు. పొలాలకు అడ్డం పడివస్తే మైలు కూడా ఉండదు, కొంచెం ఎవరైనాతోడుఉండి ఆమాటా ఈమాటామాటాడుకొంటూ వస్తే ఇరవైముప్ఫై నిముషాలలో వచ్చెయ్యవచ్చు. అల్లావస్తేరెండుఫర్లాంగులు కూడా నడిచామని అనిపించదు. ఒంటరిగా అయితే చుట్ట వెలిగించి బయలుదేరిన రైతు ఆ చుట్ట అయిపోకముందే అక్కడకు చేరుకోగలడని అక్కడివాళ్ళ నమ్మకం.

రెడ్డిపాలెంకంటె రామాపురం కొంచెం పెద్ద గ్రామం. గ్రామం మధ్య నుంచి పంటకాలువ. దాని ప్రక్కనే పడవలు వెళ్ళే మరో పెద్ద కాలువ. వాటి కి పై గా వంతెన. ఆ వంతెన దాటంగానే ఊరు. ఊరు మొగదల్లో మఱ్ఱిచెట్లు. వాటికి ఎదురుగా వీధికి అవలివైపున చిన్న తాటా కుల పాకలో కాఫీహోటలు. కొంచెం పైకివెళితే దేవాలయం వస్తుంది. ఆ దేవాలయం ముందు నుంచి వెళ్ళేదే పెద్దవీధి. దాన్నే మెరక వీధి అంటారు. ఆ వీధికి సమానాంతరంగా మరోవీధిఉంది. అది పాతవీధి. వర్షాకాలం వస్తే పాతవీధి కొత్తవీధి ఒకలాగే ఉంటాయి.

మెరక వీథిలోనుంచి వర్షపునీరు పాత వీథిలోకి ప్రవహిస్తుంది. అక్కడ నుంచి మరో వైపుగా ఆ నీరు మెరక వీథిలోకి వస్తుంది. పాతవీథిలో కంకరతోలారు, కాని అది రోడ్డుకాదు. వర్షాకాలం మోకాలిలోతు నీళ్లల్లోంచే నడచి పోవాలి. కాని ఈ వీథులు, ఇక్కడ ఇండ్లు రెడ్డిపాలెంలో కంటె చాలా నయం. ఇక్కడి వాళ్ళకు అక్కడకూడా పొలాలుఉన్నాయి. తన ఊళ్ళో కాకపోయినా ఈ ఊళ్లో అయినా ఎవరో ఒకరు తను అమ్మ చూపుతున్న ఇల్లు కొనకపోతారా, బయానాక్రింద పదో పరకో దొరక్క-పోతుందా అని ఆశపడి వచ్చాడు బుచ్చెయ్య.

పైగా రామాపురంలో అతన్ని ఎరిగిన వాళ్లు చాలా మందే ఉన్నారు. అతన్ని ఎరిగిన వాళ్ళలో కొందరు మంచి భాగ్యవంతులూ ఉన్నారు. అంతకుముందు రెండోకంటికి తెలియకుండా నోటు వ్రాయించుకొని కొద్దికాలం తర్వాత ఇవ్వతేలిన మొత్తం ఇచ్చిన దానికి రెండు రెట్లుఅయ్యాక నలుగురిలోనూపెట్టి, అల్లరిపెట్టి, దావా వేసి సొమ్ము వసూలుచేసిన వారూ ఉన్నారు సాటివాడనే దాక్షిణ్యం కూడా లేకుండా.

బుచ్చెయ్యకు ఒకప్పుడు పదిఎకరాల పొలమూ, రెండు జతల ఎడ్లూ, నాలుగు పాడి గేదెలు, రెండు ఆవులూ, కష్టనష్టాలు ఎరుగని సంసారమూ ఉండేవి. ఇంట్లో బిడ్డపుట్టినా, దొడ్లో దూడ పుట్టినా బ్రహ్మానందపడి పాలేర్లకే కాకుండా మిత్రులకూ, బంధువులకూ కానుకలుపంచిపెట్టేవాడు. ఒట్టి వెట్టివాడు బుచ్చెయ్య అనుకొనేవారు అందరూ. పండుగలూ పబ్బాలూ వస్తే సన్నని జరీఅంచు ఎనభయ్యోనెంబరు ఖాన్నూరు నేత పంచలూ, ఖరీదైన ఉత్తరీయాలూ వేసుకొని కొంచెం దర్జాగానే తిరిగేవాడు. అతను రూపసి కాకపోయినా కురూపి మాత్రం కాడు. విగ్రహం మాత్రం మంచి విగ్రహం.మంచి జబ్బపుష్టికల మనిషి. దూరం నుంచి చూస్తే ఎత్తరి అనే అని పిస్తాడు. కాని వాస్తవానికి అతను కొంచెం పొట్టి. అతను ఏమీ చదువుకొన్నవాడుకాదు. చేవ్రాలుకూడా పెట్ట

లేదు. సంసార బాధ్యత మీదపడ్డతర్వాత ఆయ్యో చిన్నప్పుడు ఒక్కరవ్వచదువుకోకపోతినే అని అతను బాధ పడ్డాడు. కొంచెం పెద్దవాడై పదిమందిలోకి వెళ్లి వ్యవహారాలు చూడవలసి వచ్చిన కొలదీ ఈ విషయమై అతనికి బాధ ఎక్కువ అవుతూ వచ్చింది. చదువేకాదు అతనికి లౌకిక జ్ఞానం కూడాలేదు. కష్టపడి పని చెయ్యడం తప్ప అతనికి మరేమీ తెలియదు. అలానే గడిచిపోయిందికాలం. తన పిల్లలు తనలాగా తయారు కాకూడదని అతని ఆశ. అందువల్లనే దగ్గరలో ఉన్న బస్తీలో వేరే కాపురం పెట్టి మగపిల్లలకు చదువు చెప్పించాడు. చిన్న తరగతులు చదువుతున్న పిల్లలకోసం బస్తీలో కాపురం, అంతఖర్చు ఎందుకని భార్య ఎంత చెప్పినా అతను వినిపించుకోలేదు. వద్దంటున్నా తండ్రినీ తల్లినీ పిల్లలను కనిపెట్టి ఉండమని బస్తీలోనే ఉంచాడు. అందుకు ఎంత ఖర్చు అయినా సంతోషంగా భరించేవాడు. ఆ ఒక్క విషయంలో తప్ప మరెందుకూ అతను డబ్బు విస్తారం ఖర్చు చేసేవాడు కాదు. ఏ విధంగానూ అతను దుబారా మనిషికాదు కాని డబ్బుదాచడం అతనికి చేతకాలేదు. అయినా అదేమీ అతన్ని బాధించలేదు.

అతను పైకి రావడానికి ఎంతోకాలం పట్టింది. ఎన్నడో తన పెళ్ళికీ దానికీ అయిన పెద్ద అప్పు దగ్గరనుంచి తండ్రి ముసలితనంలో అయిన చిన్నఅప్పుల దాకా అన్నీ తీర్చి ఉన్నఆస్తి నిలబెట్టి పెరుగుతున్న తన సంసారాన్ని సక్రమంగా పోషించుకొంటూ ఈ స్థితికి రావడానికి అతను ఎంతో కష్టపడ్డాడు. క్రమంగా ఊళ్ళోగౌరవ మర్యాదలు సంపాదించుకొన్నాడు. అవన్నీ అతను బాగా బ్రతికినరోజులు. అవి అతనికి కాలం కలిసి వచ్చిన రోజులు.

దశ మారింది.

కష్టాలలో పడ్డాడు.

కడలితరంగాలలా కష్టాలు ఒకదాని వెంట మరొకటి తరుము

కొని వచ్చాయి. తట్టుకొనిలేక పోయాడు. తండ్రికి పక్షవాతం వస్తే చెయ్యని వైద్యం అంటూలేదు. తల్లికి కడుపులో వ్రణం పుట్టి మంచాన పడితే చేయించని చికిత్స లేదు. ఒకనెల లోనే ఆ ఇద్దరూ మరణించారు. పై ఎత్తున ఉండి అన్ని విషయాలూ కనిపెట్టి చూస్తూ వచ్చిన తలితండ్రులు పోయేసరికి అతను దిగులు పడ్డాడు. సెలవలకు ఇంటికి వచ్చిన పిల్లలు మళ్లీ బస్తీకి వెళ్ళలేదు. ఆ తర్వాత రెండు మూడు నెలలకే భార్యకు క్షయ వచ్చింది. దుక్కలా ఉన్న మనిషికి క్షయ ఎందుకు వచ్చిందో అతనికి బొత్తిగా అర్థం కాలేదు. ఆవిడను బస్తీలో ఆసుపత్రిలో చేర్పించి తన తాహతుకు మించిన వైద్యం చేయించాడు. అక్కడ నయం కాకపోతే మద్రాసు వెళ్ళాడు. విశాఖపట్నం వెళ్ళాడు. రాయవెల్లూరు వెళ్ళాడు. డాక్టర్లు ఏ శానిటోరియములో చేర్చమంటే అక్కడల్లా చేర్చాడు. ఎవరు ఎంత ఫీజు అడిగితే అంతఇచ్చాడు. ఎంత ఖర్చు అవుతున్నా లెక్క చెయ్యలేదు. ఊళ్ళు వెంటపడి తిరిగాడు. ఇంటిదగ్గర పిల్లలకు రక్షణ పోయింది. అదుపూ ఆజ్ఞాలేకుండా పోయింది. ఆలనా పాలనా లేకుంటే దూరపుబంధువులు ఎవరో ఒకటి రెండుసార్లు వచ్చినెలా రెండునెలలుఉండి వెళ్ళారు. కాని వాళ్ళవలనకలిగిన ప్రయోజనం ఏమీ లేకపోయింది. పిల్లలలో ఒకడికి టైఫాయిడ్ వస్తే మరొకడికి మలేరియా వచ్చింది. ఒక పిల్లకు విరోచనాలు పట్టుకుంటే మరో పిల్లకు మలబద్ధకం పట్టుకొన్నది. రోగాలు బాగా ముదిరేదాకా అతని దూరపు బంధువులే. స్వగ్రామంలోనూ, ప్రక్కన ఉన్న బస్తీలోనూ అతని డబ్బుతోనే వైద్యం చేయించారు. రోగాలు ముదిరి ప్రమాద పరిస్థితి వచ్చాక బుచ్చెయ్యకు కబురు చేస్తే వచ్చాడు. ఈ పరిస్థితులలో మరోదారి లేక అతను అప్పులు చేశాడు. "పెళ్ళాం బిడ్డలకు జబ్బులు నయమైతే ఈ వెధవ అప్పులు ఎంతలో తీరుస్తా" అనుకొంటూ ఎన్నిచోట్ల వీలైతే అప్పులు అన్ని చోట్లచేశాడు. పెళ్ళాంమెడలోనూ ఆడపిల్లల మెడలలోనూ ఉన్న నగకట్టు

యావత్తు తాకట్టు పెట్టేశాడు మార్వాడీ వాడి దగ్గర. వెండి బంగారాలే కాదు ఇంట్లో అటకలమీద పడేసి ఉంచిన ఇత్తడి గుండిగలు, గంగాళాలు, పెళ్ళిళ్ళలో వంటకు ఉపయోగించే పెద్దపెద్ద గిన్నెలు, పళ్ళాలూ, గంటెలూ అన్నీ మార్వాడీ వాడి ఇంటికి చేర్చాడు. ఆ తర్వాత పొలాలు తాకట్టు పెట్టాడు. అప్పట్లో అతని స్వగ్రామంలోనే కాదు, ముందు పిల్లల చదువులకోసం, ఆ తర్వాత వైద్యం కోసం కాపరం పెట్టిన బస్తీలోనూ, తనస్వస్థలానికి మరింత దగ్గరగా ఉన్న రామాపురం లోనూ అతనిచేత నోటు వ్రాయించుకోని వాడు లేడు. ఓమార్వాడీ సలహామీద కాబూలివాళ్ళ దగ్గరకూడా అప్పులు చేశాడు. డబ్బుకోసం ఎంత దిగజారిపోగలడో అంత దిగజారిపోయాడు. బంధు మిత్రులను సిగ్గువిడిచి యాచించను కూడా యాచించాడు. ఎల్లాగయినా సరే చేసుకొన్న పెళ్ళానీ్న కన్న సంతానాన్ని మృత్యుముఖంనుంచి తప్పించాలని విశ్వప్రయత్నం చేశాడు. అన్నాహారాలు మానేశాడు. దిగులు పడిపోయాడు. చిక్కిశల్యమయిపోయాడు. కట్టిన బట్టలు రోజుల తరబడి, వారాలతరబడి ఒంటినే ఉండిపోయేవి. దినచర్యలో స్నానం అనేది ఒకటి ఉన్నదనే విషయమే మర్చిపోయాడు. ఎంత అలసి పోయినా కంటికి నిద్ర వచ్చేది కాదు.

అతను ఒకరోజు రాత్రి ఒంటిగంట తర్వాత ఆసుపత్రి వరండాలో పైగుడ్డ పరచుకొన్నాడు. ఎన్నడూ లేనిది నిద్ర వచ్చింది. ఏదో పీడకల వచ్చింది. చప్పున లేచి కూర్చున్నాడు. మరో క్షణం తర్వాత ఏమిటాహడావిడి అనుకుంటూ వార్డులోకి వెళ్లాడు. నెలరోజులుగా టైఫాయిడ్ తిరగబెట్టగా యమయాతన పడుతున్న బిడ్డకన్ను మూశాడు. నర్సులూ, రాత్రి డ్యూటీలో ఉన్న డాక్టరూ చివరి ప్రయత్నాలన్నీ చేశారట. నిముషాలమీద ముంచుకొని వచ్చిందట. తనకోసం వెతికారట కాని తనుకన్పించలేదట. బుచ్చెయ్య ఒక్కసారి పెద్దగా ఏడ్చాడు,

ఆ తర్వాత నెలరోజుల దాకా అతను ఏడుస్తూనే ఉన్నాడు. ఒకరి

తర్వాత ఒకరు ఏదో మహాశాపం తగిలినట్లుగా బిడ్డలంతా రాలిపోయారు. ప్రతిసారీ దగ్గర ఉన్న వాళ్ళు ఒక్కరవ్వ ఓదార్చారు.

ఎవరికోసమని అన్ని అగచాట్లూపడి అన్ని అప్పులూ చేశాడో వాళ్లు ఒక్కళ్లూ మిగలలేదు కాని ఆ అప్పులు మాత్రంమిగిలాయి. చెక్కు చెదరకుండా. పైగా కొన్ని క్రమంగా పెరిగాయి. మరికొన్ని చూస్తూ చూస్తూ ఉండగానే త్రివిక్రిమాకారం దాల్చాయి. నిలవేసి, చెవులు మెలవేసి, అప్పటికీ కాకుంటే కోర్టులచుట్టూ త్రిప్పించి మరీ వసూళ్ళు జరిపించారు. "పోనీ పాపం అన్ని విధాలాచెడిపోయాడు. దుఃఖంలో ఉన్నాడు. కష్టాలు పడుతున్నాడు. ప్రస్తుతానికి ఈ వెయ్యీ ఈ వందా వదిలేద్దాం—మనిషి మళ్ళీ కాస్త తల ఎత్తుకొన్నాక వసూలు చేసుకుందాములే" అని ఒక్కరూ ఆగలేదు. అలా ఒక్కరూ ఒక్కరవ్వసానుభూతి చూపలేదు అతనికి అప్పిచ్చిన ఆసాములు మాకు ముందు రావాలంటే మాకు ముందు రావాలని ఎగబడి ఒకరితో ఒకరు పోటీలు పడ్డారు. లెక్క వ్రాసుకోవడమదీ అతనికి మొదటినుంచీ బొత్తిగా తెలియక పోవడంచేత, ఇల్లాంటి లావాదేవీలలో ముందెన్నడూ చిక్కుకోక పోవడంచేత, అన్నింటికీ మించి క్షణంకూడా మరువలేని దుఃఖంలో ఉండడంచేత మొదట్లో అప్పుల వాళ్ళు వచ్చి ఎంతరావాలంటే అంతా ఇచ్చేశాడు. కొంత పొలం అమ్మి మార్వాడీ దగ్గరఉన్న నగలు విడిపించి, ఆ నగలు అమ్మి కొన్ని నోట్ల తాలూకు సొమ్ము చెల్లించాడు.

పొలం అమ్మి బాకీలు తీరుస్తున్నాడని తెలిసేసరికి అంతా ఎగబడ్డారు. అవకాశం చిక్కితే అందులో డబ్బు దగ్గర వదిలిపెట్టేధర్మాత్ముడెవడు! అప్పులవాళ్ళ బాధపడలేక మరికొంతపొలం అమ్మాడు. కొందరి బాకీలు తీర్చాడు "ఈ సమయంలో కాకపోతే మరెప్పుడు వసూలు చేసుకోగలం? పొలం పుట్రా ఉన్నదనే అప్పిచ్చాం. ఈ ఉన్నది కాస్తా అయిపోయిందంటే ఇక మనం అడగడమూలేదు వాడు ఇవ్వడమూలేదు. అయినా

వేలకు వేలు పొలం అమ్మించి మరీ బాకీ వసూలు చేస్తున్న పెద్ద ఆసాములకు ఉండాలి దయాదాక్షిణ్యం—ఔదార్యం—అంతేగాని నాకేః ఈ మూడువందలూ వదులుకుంటే, వసూలు చెయ్యకుండా ప్రస్తుతానికి ఊరుకుంటే ఒరిగిందేమిటి? ఎవర్ని సంతోషపెట్టాలి దీంతో" అని తర్కించుకొని ఎవరికివారు వసూళ్ళకు సిద్ధమయ్యారు.

మొదట్లో ఎవరు కన్పించినా అతనికి దుఃఖం పొర్లి వచ్చేది. ఆ రోజున ఇతని దగ్గర డబ్బు పుచ్చుకొన్నది అందుకుగదా ఆ ప్రయత్న మంతా అలా వ్యర్థమై పోయిందికదా! ఇంత ఘోరం మరెక్కడైనా ఉన్నదా" అనుకొంటూ వెనుకటి సంగతులన్నీ జ్ఞాపకం చేసుకొనేవాడు. అలా జ్ఞాపకం వచ్చి కృంగిపొయ్యేవాడు. కుమిలి కుమిలి ఏడ్చేవాడు. ఆ వచ్చిన వాళ్ళు కొంచెంసేపు ఆ మాటా ఈ మాటా మాటాడి ఏదో ఓదార్చి నట్లు ఓదార్చి నెమ్మదిగా అసలువిషయం బయలుపెట్టి తామేదో పెద్ద ఇబ్బందిలో ఉన్నట్లు నటించి నేర్పుగా బాకీ అసలు ఫాయిదాలతో సహా వసూలుచేసుకొని పొయ్యేవారు. ఇలా ఎవరికివారు విడి విడిగా పరామర్శకు వచ్చినట్లు వచ్చి తమకు రావలసింది తీసుకొనిపోవడం మొదలుపెట్టారు. శత్రుశేషం, ఋణశేషం మిగల్చకూడదని ఒకరిద్దరు గట్టిగా చెప్పి వెళ్ళారు.

అప్పట్లో అతనిదగ్గర బాకీ తాలూకు అసలు ఫాయిదాలు మొత్తం వసూలు చెయ్యనిది ఒక్క కాబూలీవాళ్లు మాత్రమే. వాళ్లు ఎప్పటికప్పుడు వడ్డీమాత్రమే తీసుకొనిపొయ్యేవారు. రెండు సంవత్సరాలు గడిచిపోయినా "అసలు" విషయం ఎత్తేవారుకాదు. అందువల్ల అసలు అసలుగానే ఉండి పోయింది. వాళ్ళు వసూలు చేసిన వడ్డీ అసలుకంటె కొంచెం హెచ్చు తగ్గుగా రెండు రెట్లు అయింది. అయినా మిగతవాళ్ళకంటె ఆ కాబూలీ వాళ్ళే నయమని పించారు బుచ్చెయ్యకు.

క్రమంగా అతను పొలం దాదాపు అంతా అమ్మేశాడు. పసుపు

కుంకం క్రింద భార్యకు వచ్చిన ఒక్క ఎకరం పొలం మిగిలింది.పొలమే కాదు దొడ్లోఉన్న ఎడ్లు కూడా పోయాయి. ఎండిపోయి రేపో మాపో చావడానికి సిద్ధంగా ఉన్న ముసలి ఆవును తప్ప మిగతా పశువులను అన్నింటినీ వారూ వీరూ బాకీల క్రింద జమ కట్టుకొని తోలుకు పోయారు.

అతను ఒకసారి తనవంకా గతంవంకా చూచుకొన్నాడు. గుండె బావురుమన్నది. కట్టుకొన్న పెళ్ళాం, కనిపెంచిన బిడ్డలూ ఏనాటినుంచో చెక్కుచెదరకుండా ఉంటూ వచ్చిన ఆస్తులుఅన్నీ మాయమయ్యాయికదా అని అతను తడవతడవకూ తల్లడిల్లి పోయాడు.ఎక్కడికో కొన్ని తాళ్ళ లోతుకు ఊబిలోపడవేసి తన్ను ఎవరో బలవంతంగా త్రొక్కి వేస్తున్నట్లూ, తను నిస్సహాయంగా పెద్దగా అరుస్తున్నా ఆ ఆర్తనాదం, తనకే వినిపించకుండా పోతున్నట్లూ అనిపించేది.

ఒక్కొక్కసారి ఇంట్లో ఒక్కడూ కూర్చుని పెద్దగా ఏడ్చేవాడు. ఉరిపోసుకొని చద్దామని ఎన్నోసార్లు అనుకొన్నాడు. ఆ పరిస్థితిలో అతన్ని ఎవరూ ఓదార్చలేరు.

పైగా ఆ స్థితిలో అతన్ని చిల్లర బాకీలవాళ్ళు మహవేధించారు. ఒకసారి అతన్ని ఒక పెద్ద మనిషి ఇంటికివచ్చి బాకీ విషయంలో నానా అల్లరి పెట్టాడు. చేతిలో ఇప్పుడేమీ లేదు మరోసారి ఇస్తాను వెళ్ళమన్నాడు బుచ్చెయ్య .అతను మొండికి వేశాడు. అయినా లాభం లేక పోయింది.చివరకు అతను దొడ్లోకిపోయి ముసలి ఆవును లేవకొట్టి తోలుకొని పోతుంటే బుచ్చెయ్య అడ్డుపడి ఎన్నోవిధాల బ్రతిమలాడాడు"దీన్ని ఏంచేసుకొంటావ్ నువ్వు.విడిచిపెట్టు.బావురు మంటున్న ఇంట్లో నేనూ దొడ్లో ఆగోవూ మిగిలి ఉన్నాం. దాన్నినువ్వు అమ్మినా ఎవరూ కొనరు" అన్నాడు బుచ్చెయ్య. అతను దురుసుగా "కొనకేం కసాయివాడు కొంటాడు. అక్కడికే తోల్తాను. నువ్వు ఏంచేస్తావో చూస్తాను" అన్నాడు.

దాంతో తగూ వచ్చింది. మాటామాటా పెరిగింది. కొద్దినిముషాలు గడవక ముందే చెయ్యిచెయ్యీకలిపారు. బుచ్చెయ్యను ఒక్క త్రోపుతోసి వెళ్ళాడతను.

అప్పుడుగాని తాను శారీరకంగా కూడా బలహీన పడ్డ విషయం గుర్తుకు రాలేదు బుచ్చెయ్యకు.

కొంతసేపైన తర్వాత ఒళ్ళు దులుపుకొని నెమ్మదిగా ఇంట్లోకి వచ్చాడు. ఆ రోజునుంచి అతనికి తనచుట్టూ ఉన్న మనుష్యులమీద అసహ్యం కలిగింది.

స్వగ్రామంలో మనుష్యులను చూచి చీదరించుకొన్నాడు. వాళ్ళ ఇళ్లూ వాకిళ్ళూ, వాళ్ళ ఐశ్వర్యమూ, తనబోటివాడికి అప్పులు ఇవ్వగల తాహతూ, ఇచ్చిన దానికి పదిరెట్లు వసూలు చెయ్యగల తెలివితేటలూ, చక్కగా, దర్జాగా ఎంతో గుట్టుగా సాగిపోతున్న వాళ్ళ సంసారాలూ అవీ చూచి తొలుత అసూయపడి కొసకు అసహ్యంచుకొన్నాడు. తోటి వాళ్ళను చూచి అసహ్యంచుకొంటూనే, వాళ్ళ నుంచి తప్పించుకొని తొలగిపోతూనే వాళ్ళ సానుభూతినీ.వాళ్ళ అనునయాన్నీ అంతరంగంలో అత్యంతం ఎక్కువగా కోరుకొన్నాడు. కాని ఆ కోరిక తీరలేదు. ఆ సమయంలోనే అతనిలో ఒక విధమైన మార్పు వచ్చింది. ఎల్లాగయినా సరే కొందరికైనా బాకీ తీర్చకుండా ఎగవెయ్యాలనుకొన్నాడు. గంపెడు దుఃఖంతో కృంగి కృశించిపోతున్నాగదా ! నేను డబ్బు పాడుచెయ్య లేదే ? వ్యసనాలకు పోయి దుర్వ్యయం చెయ్యలేదే ? ఎందువల్ల ఇలా అయిపొయ్యాను. ఇదంతా ఖర్మమే ? ఈ స్థితిలో నామీద ఒక్కరికీ జాలి కలుగలేదే ? వాళ్ళకు నేనేమి అపకారం చేశాను? మర్యాద కాపాడుకొనేందుకు పొలం కూడా అమ్మి అప్పులు తీరుస్తుంటినే. ఎందుకింత తొందర: పైగా ఆ ఇచ్చింది వందయితే నాలుగు వందలు రావాలనిపేచీ పెట్టి ఎంత వీలుంటే అంత వసూలు చేస్తున్నారే ? బాకీ వసూలు చెయ్య

డానికి ఇదేనా సమయం. అన్ని విధాలా చెడిపోయిన నాదగ్గరేనా ఇంత పెచ్చు వసూలు చెయ్యడం ? నేనూ ఒక మనిషినికాదా ? కాస్తంత జాలి ఉండక్కరలేదా ?' అని ఆలోచనలోపడి పలువిధాల తన్నుతాను ప్రశ్నించుకొన్నాడు. ఇది న్యాయమేనా అని ఇతరులను బాధగా అమాయకంగా జాలిగా చూస్తూ మూగపోయిన కంఠంతో ప్రశ్నించాడు:

వాళ్ళు పెడముఖం పెట్టారు.

ఇతను తప్పుదారి పట్టాడు.

ఇటువంటి మనుష్యులకు అసలు ఇవ్వకూడదు. ఎగగొట్టినా తప్పు లేదు. అసలు ఎగనామం పెడితే ఏం చేస్తారేం ? అదీ చూస్తా?" అనుకొన్నాడు చివరకు. అల్లా ఆలోచన కలిగాక అప్పటికి నోట్లు, కోర్టుల వ్యవహారాలు కొంత తెలిసి వచ్చాయో ఏమో ఎగవెయ్యడానికి గట్టి ప్రయత్నమే మొదలుపెట్టాడు. కొన్ని చిల్లర బాకీలు ఇదుగో అదుగో అని దాటేసి అబద్ధాలకు దిగి చివరకు ఎగవేసిన మాటా వాస్తవమే. తీర్చిన వాళ్ళదగ్గర ఇల్లు తనఖాపెట్టి మళ్ళీ అప్పులు చేసిన మాటా వాస్తవమే. పోనీ ఏమి చేసినా అతను ఏదో విధంగా నిలువద్రొక్కుకొని మళ్ళీ తలఎత్తుకొని తిరగగలిగి ఉంటే.తిరిగి ఉంటే.అతని బ్రతుకు అదో తీరునఉండేది.అల్లా జరగలేదు.ప్రపంచం సంగతి తెలియక కేవలం అజ్ఞానంలోపడ్డాడతను. తిన్నా తినక పోయినా, నిద్రపోయినా,నిద్రపోకున్నా, రోజులు గడిచిపోయాయి. వాటి దారిన అవి దొర్లిపోక బాధగా బరువుగా గడవక గడవక గడుస్తున్న జీవితంలో ప్రతి నిమిషమూ గత విషయాలను, గత సౌఖ్యాలను జ్ఞాపకం చేస్తూ నరనరాన్నీ గ్రుచ్చి వెళ్ళినాయి. అతని బాధకు అంతు లేకుండా పోయింది. దుఃఖం అతని హృదయంలో పేరుకొని గడ్డకట్టుకొని పోయింది. అతని గుండె రాయి అయింది. దీనికి తోడు అంత కష్టంలో ఉన్న తనపై జాలి, దయ చూపలేదనీ, బాకీలు తీర్చమని ఎంతో బాధించారనీ పరాయి వాళ్ళపై మన

సులో కోపం పెట్టుకొన్నాడు. ఆ కోపం క్రమంగా పెరిగింది. అదొక భయంకరమైన క్రోధంగా తయారు అయింది. ఆ క్రోధం నరనరానా కన్పించింది. అది రక్త నాళాలలో ప్రవహించి రక్తాన్ని ఉడికించింది. ఒత్తిడిపెట్టి రక్తాన్ని ఉరకలు పెట్టించింది. దుఃఖంతో గడ్డకట్టుకొని పోయి, కుంచించుకు పోయిన అతనిగుండె ఒక్కసారిగా ఉష్ణగుండమై పోయింది. అది అంతకంతకు తుకతుకలాడి పోయింది. కరిగిపోయింది. అతను నిట్టూర్పులు విడిచాడు. ఆ నిట్టూర్పులు నిరంతరం వెచ్చని సెగలు వెల్వరించాయి. పొగలు ఎగచిమ్మాయి. అతని కన్నులు మాటి మాటికీ క్రోధంతో ఎఱ్ఱపడేవి. క్రమంగా కళ్ళలో ఎఱ్ఱని జీరనిలిచి పోయింది. ముఖం నల్ల కప్పేసుకొనిపోయింది. అంతంలేని దుఃఖం అర్థం లేని అకారణమైన క్రోధం, అనుద్దిష్టమైన ప్రతీకారవాంఛ అన్నింటినీ మించి సహించరాని ఒంటరితనం అతన్ని కృంగతీశాయి.

అతని క్రోధం అతన్నే దహించివేయ సాగించింది. ఆ క్రోధ వహ్నిని, ఆ దుఃఖ తాపాన్ని అతను అకారణంగా ప్రజ్వరిల్ల చేసు కొన్నాడు. ఆ అగ్ని శిఖలు విషాహి క్రూర దంష్ట్రిలుగా ఎగసి ఎగసి వెలికి వచ్చాయి. అతని ముఖం వికృతంగా తయారైంది. బాహ్య స్వరూపమేకాదు క్రమంగా అతని బుద్ధికూడా మారింది. ఆ మార్పు అతనికే తెలియకుండా వచ్చింది.

కష్టాలలో పడి మనిషి కేవలం ఒంటరి అయినప్పుడు, ఎక్కువ కాలం అలా గడిచి పోయినప్పుడు ఆ మనిషి ప్రవృత్తి క్రమంగా మారు తుంది. చదువు సంధ్యలు. సంస్కారం కొరవడిన సందర్భాలలోనూ, ఆ మనిషికి మరో వ్యాపకం అంటూ లేని సందర్భాలలోనూ ఈ మార్పు మరీ వేగంగా వస్తుంది. ఇలా వచ్చిన మార్పు మొదట ఎంతో అసహ జంగా కన్పిస్తుంది. ఆ మనిషి స్వభావంలో ఏదో ఒక అసహజత్వం కొట్టవచ్చినట్టు కన్పిస్తుంది. తర్వాత మరికొంత కాలానికి అది ఒక

ఉద్ధృత స్వభావంగా తయారవుతుంది. ఆ ఔద్ధత్యము క్రమంగా ఒక విధమైన వైపరీత్యానికి మనో వైకల్యానికి దారితీస్తుంది. ఆ దశలోనే క్షణానికి ఒక రకంగా వెర్రితలలు వేసే విపరీత ప్రవృత్తి ప్రత్యక్షం అవుతుంది. ఆ మనిషి ఆ సమయంలో తగినంత కారణం లేకుండానే ఊరికెనే విసుక్కొంటాడు. కసురుకుంటాడు. కోపగించుకొంటాడు. ఉట్టినే ఎగిరిపడతాడు. అది నిజంగానే దౌష్ట్యమని ఎదుటివారు భ్రమ పడడం కూడా కద్దు.

బుచ్చెయ్య ఆ స్థితిలోకి వచ్చాడు.

ఎదుటివారు సానుభూతితో అతన్ని అర్థం చేసుకోలేకపోయ్యారు వారు అటువంటి ప్రయత్నం చెయ్యలేదు. వారికి అటువంటి అవసరం కలుగలేదు.

బుచ్చెయ్య అనవసరపు తగాదాలలో పడ్డాడు. మంచిమాటాడి వినయం ప్రదర్శించి ఏదో విధంగా తప్పుకుపోవలసిన సందర్భాలలో కూడా అతను తగాదాలు పెంచుకొన్నాడు. వాటి మూలంగా అతను అనవసరపు చిక్కుల్లో పడ్డాడు. బాధతో ఉన్న మనిషిని కవ్వించి, అల్లరి పెట్టి మరింత ఏడిపించడం కొందరికి సరదా. మరి కొందరి స్వభావమే అంత. వారికి అవతలి మనిషి ఏ స్థితిలో ఉన్నాడన్నది పట్టదు. అవతలి మనిషిని కారణంఉన్నా కారణం లేకపోయినా హింసించేందుకు అవకాశం చిక్కితే దాన్ని జారవిడువరు. మరికొందరు ఉంటారు. ఎదుటి వాళ్ళ దగ్గర నుంచి వీలైనంత సహాయం అంతా రాబడతారు. ఇంకా దిఅ చెయ్యలేదు ఇది చెయ్యలేదని సణుగుతూ పనులుచేయించుకొంటారు. అంత ఉపకారం చేసిన మనుష్యులే కొంచెం కష్టంలో ఉంటే, మానసికం గానో, శారీరకంగానో కొంచెం బలహీనంగా కన్పిస్తే అదే అదను అనుకొని విరుచుకు పడిపోతారు. ఎంత వీలైతే అంత అపకారంచేస్తారు. ఎంత వీలైతే అంత పెద్ద అభాండాలు వేస్తారు. ఎన్ని విధాల వీలైతే

అన్ని విధాల దుష్ప్రచారం చేస్తారు. శత్రువులపట్లకూడా ప్రవర్తించనంత అసహ్యంగా, దుర్మార్గంగా ప్రవర్తిస్తారు. ఇందుకు కారణం ఏమీ ఉండదు. వీళ్లైతే కృతజ్ఞత చూపవలసిన వారిపట్ల ఎందుకింత శత్రుత్వం అంటే సమాధానం ఉండదు. అది అంతే. అది వారి స్వభావం అని సరిపెట్టుకోవాలి.

పూర్వం తన దగ్గర ఏదో సహాయం పొందిన వాళ్ళే అప్పుల వాళ్ళను వెంటబెట్టుకొని వచ్చి హెచ్చు వడ్డీతో సహా బాకీ వసూలు జరిపిస్తున్న సమయాలలో బుచ్చెయ్య రెచ్చిపోయ్యాడు. తనపట్ల సానుభూతి చూపలేదని అసలే క్రోధంగా ఉన్నది. దానికీరకం అన్యాయంతోడైంది. అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. ఆవేశం పట్టలేక మండిపడి నాలుగూ జాడించడమే కాకుండా చెయ్యిచేసుకోవడందాకా వచ్చింది. వాళ్ళకు కావలసిందీ అదే. అది సాకుగా తీసుకొని ఇక ఎంతైనా సాధించవచ్చు. కొందరు అతన్ని ఎన్నోవిధాల రెచ్చగొట్టారు. అతను అజ్ఞాని కావడంతో రెచ్చిపోయి వాళ్ళమీద చెయ్యి చేసుకొన్నాడు. 'ఇవ్వవలసింది ఇవ్వకపోగా వీడికి ఇంత పొగరా ! ఇంత అహంకారమా ! మన కాళ్ళు పట్టుకోవలసిన స్థితిలో ఉండి మనపై చెయ్యి చేసుకొంటాడా?' అని వాళ్ళు కేవలం కసికొద్దీ కేఅతనిపైసులు పెట్టారు. డబ్బిచ్చి తప్పుడు సాక్ష్యాలు పలికించారు. మరోవైపునుంచి కాబూలీ వాళ్ళను ఉసికొలిపి బాకీ మొత్తం వసూలు చేసుకోమని ప్రోత్సహించారు.

కాబూలీ వాళ్ళతోనూ అతను అదేరకంగా ప్రవర్తించాడు. రెండేళ్ళ నుంచి ఇస్తూనే ఉన్నా. ఇచ్చింది అసలుకంటె రెండు మూడు రెట్లయ్యింది. ఇంక ఇచ్చేది ఏమీ లేదు పొమ్మని దబాయించాడు. వాళ్ళు అతన్ని బజార్లోనే పట్టుకొని కొట్టి వెళ్ళారు. అక్కడితో వారైతే తృప్తి పడ్డారు కాని వాళ్ళను ప్రోత్సహించిన వారికి తృప్తి కలుగలేదు. అతను దెబ్బలు తిన్న విషయం కోర్టుకు ఎక్కించి అతను మర్యాద లేనివాడనీ,

అందరికీ బాకీలు ఎగగొట్టాడనీ, బాకీ ఇమ్మని అడిగితే ఎందరి మీదనో చెయ్యిచేసుకొన్నాడనీ పితూరీ చేసి అవన్నీ దొంగ సాక్ష్యాలతో ఋజువు చేసి క్రిమినల్ కేసులో ఇరికించి నెమ్మదిగా జైల్లోకి నెట్టించారు పది మందీ కలిసి. అక్కడికిగాని వారికి కక్ష తీరింది కాదు.

బైట ప్రపంచంలో పదిమందీ ఉన్నచోట ఉన్నప్పుడే అతను ఒంటరిగాడు. ఇక బందిఖానాలో ? ఆ ఒంటరి తనం భరించలేక పోయాడు అతను. బయట ఉన్నప్పుడే ఒంటరితనం మూలంగా అతని స్వభావం మారింది.

అది అలాగే మారుతుంది.

అలా మనిషిలో విపరీతపు ఔద్ధత్యాన్ని తెచ్చి పెట్టిన ఒంటరి తనం ఇంకా మరికొంత కాలం అలాగే సాగితే—దానికి బాధ, క్రోధం తోడైతే ఆ వ్యక్తి మనస్సు చలిస్తుంది. అతను పిచ్చివాడయి పోతాడు. పరిస్థితి మారకపోతే పిచ్చివాడుగానే మరణిస్తాడు. మనిషి సుఖంగా బ్రతికి, బ్రతికి చెడి, విపరీతపు ఆవేశాలకు లోనై పిచ్చివాడై చివరకు పిచ్చిలోనే మరణించడం చిత్రవధకులోనుగావడంతో సమానం. ఇలాకాక పిచ్చివాడు కాకముందు అతనికి తాగుడు ఏదైనా 'బలమైన'దుర్వ్యసనం అలవడితే—ప్రవాహంలో పడి కొట్టుకొని పోయేమనిషి ఏదో గడ్డిపోచ వంటి ఆధారం ఒకటి కనిపిస్తే దాన్ని పట్టుకొని, అదే బ్రహ్మాండ మనుకొని, అదే తన్ను ఒడ్డుకు చేరవేస్తుందని, తరింపచేస్తుందని భ్రమపడి కొండంత ఆశతో కొంత దూరం దానితో పాటు గమించి ఆ తర్వాత మరింత అగాధంలో-సుడి గుండంలోపడి. గింగిరాలు తిరిగి, కొసకు మునిగిపోతాడు, అక్కడితో ఆ దురదృష్టవంతుడి జీవితం ఆఖరు.

బుచ్చెయ్య జైలులో ఉన్నది ఏడాదే అయినా అయిదారు సంవత్స రాలు ఉన్నట్లు అనిపించింది అతనికి. అందులో అతను అనుభ వించింది కఠినశిక్ష. ఒక్కడికే విడిగా కేటాయించిన గదిలో

ఉంటూ కూలి పనులు చేస్తూ. జైలు అధికారుల ఆదేశాలు అమలు జరపనప్పుడల్లా కొరడా దెబ్బలు తిని అంతకంతకు మొటుబారిపోతూ కాలం గడిపా డతను. అతను అక్కడ యమయాతనపడ్డాడు. ఆ బాధ పడలేక అక్కడే గొంతు పిసుక్కొనిచావాలని చాలాసార్లే అనుకొన్నాడు. కాని అది సాధ్యం కాలేదు. అది అల్లా జరగలేదు. కారాగారంలో ఉండగానే అతను సగం పిచ్చివాడయ్యాడు. ఆకలి దప్పులు దాదాపు పూర్తిగా పోయాయి తాత్కాలికంగా. ఏడాది తర్వాత అతను బయటకు వచ్చాడు. క్రోధం పగపట్టినతాచుపాము. అది అతని వెన్నంటి వచ్చింది. జైల్లో కలిగిన స్నేహంలా దుఃఖం అతనికి తోడు వచ్చింది. ఆ స్నేహం ఫలితంగా అబ్బిందేమో అన్నట్లు బయటకు వచ్చిన మరుక్షణం నుంచే అతనికి తాగుడు అలవాటు అయింది.

అతనికి ఆ తాగుడు అతి శీఘ్రంగా బాగా అలవాటైంది. తనకు కలిగిన దుర్గతిని మరచిపోవడానికి, మనసుకు బాధ కలిగించే ఆలోచన తప్పించి, తప్పించుకొని తిరగడానికి అది ఒక్కటే ఉత్తమమైన చాల సుఖమైన మార్గంలా, అందుబాటులో ఉన్న సదవకాశం లాకన్పించింది. గాఢాంధకారంలో సన్నని కాంతిరేఖలా, అదొక ఆశాకిరణంలా కన్పించింది అతనికి. ఆ అవకాశాన్ని అతను జారవిడువలేదు. అజ్ఞానం తోడు అయింది. దాన్ని అతడు ఆశగా అందుకొన్నాడు. వగరుస్తూ,రొప్పుతూ అందుకొన్నాడు. కల్లు పాకలో,సారా దుకాణంలో దుర్గంధ పూరితమైన, అసహ్యకరమైన మట్టి పాత్రను అమృత కలశంలా అందుకొన్నాడతను.

మొదటి రోజులలో అదీ కష్టంగానే ఉండేది. కొద్దిగా ఒక్క అరగ్లాసుడు తప్పదన్నట్లు ఔషధంలా త్రాగి వచ్చేవాడు. క్రమంగా ఆ పరిమాణము పెరిగింది. పుట్టకురుపులా పెరిగింది అది. మొదట చూచినప్పుడు పెసరగింజంత ఉన్నదల్లా క్రమంగా భయంకరమైన పెద్ద వ్రణంలా తయారవుతుంటే చూచి మరేమీ చెయ్యలేక ఊరికే దిగులు

పడి పొయ్యే నిస్సహాయుడిలా, దిక్కూ దివాణం, లేని దౌర్భాగ్యుడులా తయారయ్యాడు. బుచ్చెయ్య తాగుడు బాగా అలవాటయి పోతున్న మొదటి రోజులలో తాను అపమార్గంలో పడి మరీ మరీ పతనమై పోతున్నట్లు తెలిసి కూడా అది మానే ప్రయత్నం చెయ్యలేదు. తాను చెయ్యగలిగిం దేమీ లేదన్నట్లు ఊరుకొన్నాడు. "పైగా తాగితే ఏం ? చెడిపోతానా ! ఏం చెడితే ? ఇంతకంటె చెడిపొయ్యేదేముంది!" అనుకొనేవాడు. అతను ఇలా అనుకొంటూ ఉండగానే అది వదలని వ్యసనమై కూర్చుంది. దయ్యం పట్టినట్టు పట్టుకొన్నదది. అదీ భల్లూకం పట్టు. ఆ పరిస్థితి వచ్చాక అతను దాన్నిగురించి, అది ఏదో విధంగా మానాలనే ప్రయత్నం గురించి ఆలోచించనేలేదు. ఎప్పుడైనా అటువంటి ఆలోచన వచ్చినా—మనస్సు హెచ్చరించినా అతను లెక్క పెట్టలేదు. ఆరోగ్యం చెడిపోతున్నా అతను లెక్కపెట్టలేదు. ఊరివారి విషయం అతను అసలే లెక్కచేయలేదు. తన ఆరోగ్యం, తన ఆస్తి తన మంచి పట్టని వాడికి ఊరివారి సొమ్ము విషయం పడుతుందా! ఎవరు ఏమన్నా తన్ను కాదనుకొని దులబరించుకొని తిరిగాడు. చిత్తుగా తాగి అన్నీ మరిచిపోయి ఇంట్లో ఒకమూల పడి నిద్రపోతూ కాలం గడప డానికి ప్రయత్నించాడు, కాని కాలం అతికష్టంగా గడిచింది.

తాగుడు అలవాటు అయ్యాక అతను మళ్ళీ బాగా అప్పులు చెయ్యడం ప్రారంభించాడు. తాగుబోతు అని తెలిసి కూడా ఇచ్చేవాళ్ళు అప్పులు ఇస్తూనే వచ్చారు. చేతికి చిక్కింది అమ్మి తాగాడు. కొంత మంది మళ్ళీ నోట్లు వ్రాయించుకొని డబ్బు ఇచ్చారు. వాళ్ళ కంటె నిరభ్యంతరంగా కాబూలీ వాళ్ళు అప్పు ఇచ్చారు.

అప్పిచ్చిన వాళ్లు ఎక్కడ కన్పిస్తారో అని అతను భయపడుతూ పెద్ద బజార్లు తప్పించి సందుగొందుల వెంటపడి తొందర తొందరగా ఇంటికి చేరుకొని తలుపు బిగించుకొనేవాడు. ఎవరు తన్ను రెచ్చగొటే

దెబ్బలాడి కోర్టుకు ఈడ్పించి జైలుకి త్రోయిస్తారో అని సారా మైకం లేనప్పుడు వణికిపొయ్యేవాడు. మైకంలో ఉన్నప్పుడు ఇతరులు భయపడే వారు.

రకరకాల భయాలు పెనుభూతాలలాగా అతన్ని ఆవహించాయి. వాటిని వదలించుకోడానికి కూడా మితిమీరి తాగడం ఒక్కటే మార్గం అనిపించింది అతనికి.

తప్పతాగి ఇంటికి వచ్చి గుమ్మంలో కూర్చుని, వడ్డీలు పెచ్చువేసి, తప్పుడు లెక్కలు వ్రాసి, తనకు అన్యాయంచేసి తన ఆస్తి కట్టుకొన్న వాళ్ళనూ, ఉట్టి పుణ్యానికి పెళ్ళాం బిడ్డలను ఎత్తుకొని పోయిన దేవుణ్ణి కలిపి తిట్టిపోసేవాడు. తిట్టి తిట్టి నోరు నొప్పిపుట్టాక అక్కడే నడుము వాల్చేవాడు.

ఏది ఏమైనా సరే అమ్మనే కూడదు అనుకొన్న భార్యకు పసుపు కుంకుమ క్రింద వచ్చిన ఎకరం పొలం ఇట్టే అమ్మేశాడు తక్కువ ధరకు. ఇంట్లో మిగిలిన వస్తువులన్నీ బయటకు చేర వేశాడు. అమ్మదగిన వస్తువులన్నీ అమ్మేశాడు. అవీ ఇవీ అమ్మగా వచ్చిన డబ్బుతో తాగి, నానాతిట్లూ తిని చాలా చోట్ల అర్ధచంద్ర ప్రయోగాలు సహించలేక సహించి కొంపకు చేరుకునేవాడు గొణుక్కుంటూ, సణుక్కొంటూ. అన్నీ పోగా ఆ ఇల్లు ఒకటి మిగిలింది-అదీ తనఖాలతో.

బుచ్చయ్య అదీ తేలిగ్గా అమ్మేశేవాడే-గాని అంత తొందరలో కొనే వాడే కన్పించలేదు. అల్లాంటి ఇల్లు ఆ ఊళ్ళో కట్టించాలంటే ఎంత లేదన్నా నాలుగయిదు వేలు అవుతుంది. కాని అతను అమ్మ చూపితే వెయ్యి కూడా ఇస్తానన్నవాడులేడు. ఆ యిల్లు ఎన్నడో తనఖా పెట్టుకొని అయిదు వందలో ఆరువందలో అప్పు ఇచ్చిన మార్వాడీ పెద్దమనిషి తన కీయవలసిన బాకీ వెయ్యికి పైగానే ఉన్నదనీ, తనకు వీలైనప్పుడు దావావేసి ఇల్లు తన పేరున కొట్టించేసుకొంటాననీ అందరితో చెప్పడం

మొదలు పెట్టాడు. ఏదైనా బేరం వచ్చినా కొందరు పనివేళా వచ్చి అతని ముందటే వాళ్ళకు "అబ్బే అచ్చొచ్చే కొంపకాదిది. కొనుక్కోవాలీ అంటే మీకు ఇల్లే దొరకదా ! "అనేవాళ్లు. ఆయింటికి ఒక్కరవ్వ కూడా ధర రావడం ఎవరికీ ఇష్టంలేదు. చెడి అమ్ముకొంటున్నాడూ అంటే అసలు ఏ వస్తువుకూ ధర పలకదు. చివరకు బంగారానికి బంగారం ధర రాదు. అవతలివాడు అవసరంతో ఉన్నాడనీ, అతను అది అమ్మక తప్పదనీ తెలిస్తే కొనేవాడికి అలుసైపోతాడు.

బుచ్చయ్య పనీ అంతే అయ్యింది.

ఆ యిల్లు ఎవరూ కొనమన్నారు.

డబ్బులేకపోతే అతనికి రోజులు గడవనన్నాయి. కాని గడిచిపోయ్యాయి. సారాదుకాణంలో కూడా ఖాతాపెట్టి త్రాగివచ్చి. మంచంలో పడి తిండీ తిప్పలులేకుండా రోజులు గడిపి వెయ్యడం నేర్చుకొన్నాడు. తాగుడుబాగా అలవాటైనవాడికి మామూలు మనిషికంటె ఎక్కువ ఆహారం కావాలి. లేకపోతే అతి శీఘ్రంగా ఆర్చుకుపోతాడు. చిక్కిశల్యమైపోతాడు. ఏ రోగం పడితే ఆ రోగము అతిసులభంగా రావడానికి అవకాశం ఏర్పడుతుంది.

అతనికి ఒకసారి హఠాత్తుగా పెద్దపెట్టున జ్వరం వచ్చింది. జ్వరంతో పాటుతెరిపిలేకుండా దగ్గు.నెలరోజులు మంచంలో పడిఉన్నాడు. చూచేదిక్కు లేకపోయింది. మందూ మాకూ లేకపోయినా ఇంత గంజి అయినాపోసిన వాళ్ళులేరు. అసలు పలకరించిన వాళ్ళేలేరు. అతని భార్యా పిల్లలు గతించిన మొదట రోజులలో కాస్త కాచిపొయ్యడానికని అతని ముత్తవతల్లి ఒకామె వచ్చి కొంతకాలంపాటు ఆ యింట్లో ఉండిపోయింది. కాని ఏ విషయమూ సమర్థించుకొని రాగల శక్తి సామర్థ్యాలు ఆవిడకు బొత్తిగాలేవు. ఆవిడ వయస్సు ఎనభై దాటిపోయింది. అక్కడ ఉన్నంతకాలం ఆ ముసలానిడ ఓపిక ఉన్ననాడు లేచి ఇంత అన్నం వండి

పెట్టేది. లేనినాడు ఓమూల ఒదిగి పడుకొని ఉండేది. అతను ఏమైపోతున్నాడో, క్రిమక్రిమంకా ఎలా దిగబారి పోతున్నాడో ఆమెకు సరిగా తెలియదు. ఒకరు తనకు పోషణ జరపవలసిన వయస్సులో ఈ కష్టాలన్నీ చూస్తూ తానే ఒకరికి సేవ చేయవలసి వచ్చిందికదా అని బాధ పడుతున్నట్లు కన్పించేది ఆవిడ.

అతనెప్పుడూ ఆమెను ఆప్యాయంగా పల్కరించలేదు, ఏదీ అడగలేదు. విస్తట్లో ఇంత అన్నం పెట్టినందుకు కృతజ్ఞతా చూపలేదు. రెండు రోజులైనా లేవకుండా నేలమీద మూలగా ఒదిగి పడుకొని నిద్ర పోతుంటే అదేమని కొపగించనూ లేద తను. "ఎప్పుడూ ఒకటే సణుగుడు కృష్ణ కృష్ణ అంటూ!" అనుకొని అతను విసుక్కొన్నాడు. అలా విసుక్కొంటూ ఒకటి రెండుసార్లు ఆవిడకు వినిపించేలా దేవుణ్ణితిట్టిపోశాడు. అంతా విని ఆవిడ తల వంచుకొని కళ్లు మూసుకొని కృష్ణ కృష్ణఅంటూ ధ్యానం చేస్తూ చెంపలువేసుకొన్నది. మాటాడే ఓపిక లేదావిడకు. అక్కడ ఆవిడా ఎక్కువ కాలం ఉండలేదు.

పిలిస్తే వచ్చిన మనిషి కాదావిడ. ఎలా వచ్చిందో బుచ్చెయ్యకే తెలియదు. పోవడమూ అల్లాగే పోయింది. ఏదో గొణుక్కొంటూ విముక్తికోసం ప్రార్థనలు చేస్తూ ప్రాణాచారం పడినట్లు రోజుల తరబడి కటిక నేలమీద ఉండిపోతూ కదలలేక కదులుతూ, ఏ ఒక్క రవ్వ ఓపిక ఉన్నా పనులు చేస్తూ ఒకనాడు వంటఇంటి వెనుక పేరట్లో తులసి కోట దగ్గర ఒరిగిపోయి సునాయాసంగా ప్రాణం విడిచింది. ఆ ముసలావిడ సుఖంగా వెళ్ళిపోయింది.

"చావడానికైనా ఒక ఇల్లు,నాదిఅన్న స్థలం, నావాడు అన్నమనిషి కావాలి కాబోలు అందుకేనా ఏమిటి ఈ ముసలిది ఇక్కటకు వచ్చి ప్రాణం విడిచింది." అని ఒకసారి, ఏ జన్మలోనో నాకేదో కొద్దోగొప్పో ఋణపడి ఉంటుంది. అందుకే పోతూ పోతూ ఇక్కడకు వచ్చింది,

ఋణం తీరగానే వెళ్ళిపోయింది. " అని మరోసారి అనుకొన్నాడు బుచ్చెయ్య. అతను ఆమెకు దహన సంస్కారాలు జరిపిస్తూ నిజంగా ఆవిడ అదృష్ట వంతురాలు రోగంతో తీసుకోకుండా "ఒకళ్ళచేతచేయించుకోకుండా హాయిగా దాటిపోయింది. అనికూడా అనుకొన్నాడు.

తాగుడు మూలంగా శరీర దార్ఢ్యం పోయి, జ్వరం వచ్చి మంచంలో పడిఉన్నాడు దగ్గుతూ,మూల్గుతూ, ఆ జ్వరం ఎలా తగ్గిందోఆగడం గడిచి ఎలా ఎందుకు బయట పడ్డాడో అతనికే తెలియదు, తిండిలేక, స్నానం లేక, నిద్రలేక, జ్వరం వస్తే మందూ మాకూ లేక, జ్వరం తగ్గాక పథ్య పానాలులేక అతని శరీరం బాగా దెబ్బతిన్నది అమిత బలహీనతకు తోడు ఒళ్ళంతా చీడ బయలు దేరింది. "వెధవ దురద" అని రక్కుకొన్నాడు. దురద పుట్టినంత మేర కండకు కండ కోసి అవతల పారేద్దామన్నంత కసిగా రక్కుకొన్నాడు. తన కోపమంతా దానిమీదే చూపించాడు. రక్కుకొన్నకొద్దీ, కోపగించుకొన్నకొద్దీ,చీదరించు కొన్నకొద్దీ అది శరీరమంతా ప్రాకింది. పాడు పడిన కోనేటిలో నాచులా అల్లుకొని పోయింది. "అయ్యో ఆ ముసల్ది ఉన్నా ఇంత గంజైనా కాచి పోసేదికదా" అని అతను చాలాసార్లు అనుకొన్నాడు. బంధువులు ఎవరూ ఒక్కరైనా వచ్చి చూచి పోలేదని పరి పరి విధాల బాధ పడ్డాడతను.

మరో వారం గడిచింది.

కొంచెం ఓపిక వచ్చింది.

ఒక్కరవ్వ లేచి తిరిగే ఓపిక చిక్కగానే అతను సరాసరి సారా దుకాణానికి వెళ్ళాడు. ఇక అదే అతనికి ఇల్లయిపోయింది.అక్కడి మనుష్యులే అతనకి నిజమైన స్నేహితులయ్యారు.

ఇల్లు అమ్ముతానని అందరికీ పదే పదే చెప్పుకొన్నాడతను. మీరు కొనండి మీరు కొనండి అని కాస్త పరిచయం ఉన్నవాళ్ళను అందర్నీ ప్రాధేయపడి అడుగుతూ, అతను చీదు గోక్కుంటూ ఊరంతా

తిరిగాడు. అమ్మవద్దనిగాని, ఏదో విధంగా మళ్ళీ బాగుపడే ఉపాయం చూచుకొమ్మనిగానీ అతనికి ఎవరూ చెప్పలేదు. పైగా "అచ్చిరానికొంప మాకు అంటగడతావా! మార్వాడీకి తనఖా పెట్టావు కదా— వాడికే అమ్ము ఇది మరెవ్వరు కొంటారు. అదిసరే మా బాకీ ఎప్పుడు తీరుస్తావు?" అన్నారు. ఎవరిమట్టుకు వాళ్లు అతను ఇల్లు అమ్మే సమయం కనిపెట్టి తమ బాకీ వసూలు చేసుకోవాలని అనుకొన్నారు. ఒకరిద్దరు తమ బాకీల క్రింద ఇల్లు వ్రాసి ఇమ్మని కూడా సలహా చెప్పారు. "దొంగలు—అంతా దొంగలు—కొనమంటే అచ్చిరాని కొంపట! అప్పు క్రింద వ్రాయించుకోడానికైతే బాగానే పనికి వస్తుందేం!" అని తిట్టుకొంటూ ఇక ఆఊళ్ళో తన ఇల్లు కొనేవాడు లేడని బుచ్చెయ్య ఆరోజు పొరుగున ఉన్న రామాపురం బయలుదేరి వచ్చాడు. ఎవరి కాళ్ళమీదనైనా పడి తన ఇల్లు ఎంతకో అంతకు కొనుక్కోమని బ్రతిమిలాడు కొందామని వచ్చాడు. ఆయిల్లు అమ్మేసి ఆ డబ్బుతో మరికొంత కాలంపాటు నిశ్చింతంగా తాగి ఆ తర్వాత ఎక్కడికో ఏ దూరప్రాంతాలకో పోయి గొంతుకు ఉరి పోసుకొనైనా చావచ్చుననుకొన్నాడు. తను ఆపూట బాగా తాగి ఆ మాటే అనుకొంటూ పైకి అంటూ తూలుతూ మిట్ట మధ్యాహ్నం నిప్పులు చెరుగుతున్న వేసగి మండుటెండలో నడిచివచ్చాడు. ఆ ఊరు చేరుకొని మఱ్ఱిచెట్టు నీడలోకి వచ్చాడో లేదో శోషవచ్చి తల తిరిగి పడిపొయ్యాడు. వడదెబ్బ తగిలింది. సఅలే బలహీనంగా ఉన్నాడేమో మొదలు నరికిన తాడిలాపడిపొయ్యాడు.

అసలే అతను పడిపోయిన మనిషి. కుటుంబం యావత్తుపిడుగు పడి కాలిపోయినట్టు నాశనమైపోయినప్పుడు అతను మొట్టమొదటిసారి పడ్డాడు. కుప్పకూలి పొయ్యాడు. ముఖం దోక్కుపోయింది. గంట్లు పడ్డాయి. మోచేతులు, మోకాళ్లు కూడా దోక్కొని పొయాయి. కొంత వికారం అప్పుడే వచ్చింది. కాని లేచి మళ్ళీ ఏదో విధంగా నడక సాగించాడు. అతను మళ్ళీ నడిచాడు—అప్పులు తీరిస్తూ—దుఃఖాన్ని దిగ

మింగాలని వ్యర్థప్రయత్నం చేస్తూ—ఒంటరిగా నాలుగు అడుగులు ముందుకు సాగకముందే అప్పులు, తగాదాలు, అనవసరపు ఆవేశాలు పెరిగిపోయి వాటిఅన్నింటి ఫలితంగా చీకటి కొట్లోకి వెళ్లవలసి వచ్చినప్పుడు అతను మళ్ళీపడ్డాడు. కాళ్లువిరిగినట్లు అయ్యింది. మడమలకు మోపుగా తగిలిందిదెబ్బ. నడుము పట్టుకొని పోయింది. అలా వంగిన వెన్ను తాగుడుమూలంగా విరిగింది. నడిమికి విరిగిన అరటిచెట్టులా కన్పించాడు అతను. ఊరివారినుంచి తప్పుకు తిరుగుతూ, భయపడుతూ, తూలుతూ నడిచాడు అతను. జీవిత రథానికి అలంకారంగా కట్టిన గెలలు వేసిన అరటిచెట్టు అతను గమించవలసిన మార్గంలో ఆ రథం ఎంతో దూరం వెళ్ళకముందే హఠాత్తుగా విరిగిపోగా, గెలలు కొట్టి వేసిన తర్వాత కూడా, రూపు చెడి, అందవికారంగా తయారైన తర్వాత కూడా దానిని తీసి ఆవల పారవెయ్యకుండా రథం ముందుకు సాగినట్లుగా అనిపించింది. అది నడక కాదని అతనికీ తెలుసు. జైలునుంచి బయటకు వచ్చాక జబ్బుచేసి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. దాంతో నెత్తికే చాలా బలమైన దెబ్బ తగిలింది. కూలిపోయాడు. బలమైన దెబ్బసరిగ్గామాడుమీద తగిలిదిమ్మతిరిగినేలకు ఒరిగిపోయినట్లు పడిపొయ్యాడు అతను.

అతను పడిపోయి చాలా సేపయినా స్పృహరాలేదు. నోటివెంట నురుగు వచ్చింది. అంతకుముందు ఎప్పుడో గీరుకొన్న పుండ్లు దుర్వాసనతో పరమ వికారంగా కన్పించాయి. స్పృహ వచ్చిన తర్వాత కూడా ఆతను ఎంతో సేపటిదాకా లేవలేక పొయ్యాడు,

చుట్టూ చేరిన వాళ్ళు పడిపోయిన మనిషిని చూచి అసహ్యించుకొన్నారు. దుర్వాసన భరించలేక ముక్కులు గట్టిగా మూసుకొన్నారు. ముఖాలు త్రిప్పుకొన్నారు కొంత సేపు తర్వాత నెమ్మదిగా అవతలకు వెళ్ళిపోయారు చీదరించుకొంటూ.

అతను వేసుకొన్న రంగుచొక్కా వీపుమీద బెత్తెడు మేరచినిగి

ఉన్నది. కట్టుకొన్న పంచ చాలా చోట్ల చినిగి పేలికలుగా తయారైంది. జుట్టు మట్టి కొట్టుకొని ఇంతఎత్తున రేగి అసహ్యంగా ఉన్నది. మనిషి బక్కచిక్కి ఉన్నాడు. ఎముకలగూడులా ఉన్నాడు. బయటకు పొడుచుకొని వచ్చిన ఎముకలు అతన్నే వెక్కిరిస్తున్నట్లున్నాయి.

అతని పూర్వచరిత్ర అక్కడ చేరినవారందరికీ తెలుసు. మిగతా విషయాలకంటె అతను తాగుబోతు అనేవిషయం అందరికీ బాగా తెలుసు. వారు అతన్ని అంతగా అసహ్యించుకోడానికి తమకుతాము చెప్పుకొన్న కారణం అదే. అసలేమీ ఎరక్కపోతే, అతను కేవలం క్రొత్త వ్యక్తి అయితే "ఎవరో పాపం" అని ఒకరు కాకపోతే మరొకరైనా జాలిపడే వారేమో! జాలిపడి కాకపోయినా అవతలి వాళ్ళంతా ఏమనుకొంటారో అని భయపడి అయినా కాస్త చేయూతఇచ్చి సాయం చేసే వారేమో.

క్రొత్తగా పనిలో కుదిరిన ఓపాలేరు కుఱ్ఱవాడు అతన్ని చూచి మూర్ఛవాడనుకొని కడవతో నీళ్ళుతెచ్చి దూరంగా నిలబడి సగం నెత్తి మీద పోశాడు. బుచ్చెయ్య కొంచెం కదిలి దాహం పొయ్యమని చేత్తో సంజ్ఞచేస్తే ఆపాలేరు కుఱ్ఱవాడు నెమ్మదిగా కడవ ఎత్తి నీరు నోటి దగ్గరగా ధారగా పోశాడు. బుచ్చెయ్య శరీరాన్ని అతి ప్రయత్నంమీద లేవనెత్తుకొని లేచి కూర్చుని మోచేతి మీదుగా ప్రక్కకు వంగి కుడిచెయ్యి ఎత్తి ఇంకా కాసిన నీళ్ళు పొయ్యమని సంజ్ఞ చేశాడు. అరచెయ్యి దొప్పగా చేసుకొని నోటిక్రిందుగా పెట్టుకొని పోసిన నీళ్లు పోసినట్టే గటగట త్రాగాడు. కాని ఓపిక రాలేదు. బాధగా మూల్గుతూ దొర్లాడి ఒకటి రెండు సార్లు లేవడానికి ప్రయత్నం చేశాడు. కాని ఆ ప్రయత్నాలు ఫలించ లేదు.

నేలంతా బురద అయ్యింది. అతను లేవడానికి చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు ఒకరిద్దరిమీద బురదనీరు చింది పడ్డది. అందుకువారు కోపగించుకొన్నారు. కాలువ కట్టినసీరు ఎక్కడ కాలికి తగులుందో అని

భయపడుతూ ఎత్తి ఎత్తి అడుగులు వేస్తూ ఇద్దరు వెళ్ళిపొయ్యారు.

ఆ పరిస్థితి అంతా చూచి బాధపడుతూ పాలేరు కుఱ్ఱవాడే వెళ్ళి రంగమ్మతో చెప్పాడు. ఆ కబురు విన్నది రంగమ్మ. అంతలోనే ఉన్న పాళంగా వచ్చేసింది.

ఆ రావడం రథంలా వచ్చింది.

దారికి అడ్డం తొలగారు కొందరు.

అందరూ ఆమె వంకే చూచారు.

లేత గులాబీరంగు సిల్కు జాకెట్టు వేసుకొని, సన్నని జరీ అంచు మబ్బురంగు నేతచీర కట్టుకొని, అంతపెద్ద జుట్టు కొండెచుట్ట చుట్టుకొని నిండైన ఆ మనిషి హుందాగా వస్తుంటే అందరూ అటే చూచారు. వెట్టి వాళ్ళను పంపుదామా, ఈ పాటికి పొయ్యాడో ఏమో అనుకొంటూ పొలం పోకుండా తిరిగివచ్చి దూరంగా నిలపడిన మునసబుగారూ, షికారుకువెళ్ళి 'పిట్టల వేటకు ఈ పూట అనుకూలంగా లేదు' అనుకొంటూ చిరాకుపడుతూ ఊరంతా బలాదూరు తిరిగివచ్చిన మునసబుగారి పెద్ద కొడుకూ, కొంతసేపు అక్కడ నిలబడి చీదరించుకొని తొలగి వెళ్ళిపోతున్న గ్రామ పెద్దలూ—ఇతరులూ అందరూకూడా ఆమెను చూచి విస్తుపొయ్యారు. ఇదేమా ఈమె ఇక్కడకు వస్తున్నదీ! అనుకొన్నారు.

రంగమ్మ సరాసరి చెట్టు క్రిందకే వచ్చింది. ఏమిటో చోద్యం చూస్తున్నట్లు చూస్తూ నిలబడ్డ ఒకళ్ళిద్దరిని నెమ్మదిగా తప్పించుకొని ముందుకు వెళ్లి రొచ్చు రొచ్చు అయిన నేలమీద పడి దొర్లుతున్న బుచ్చెయ్యను చూచింది. ఒక క్షణం తనూ అసహ్యించుకొన్నది. పూర్వం ఒకప్పుడు అతను వెలిగిన స్థితినీ, అప్పటి అతని స్థితినీ జ్ఞాపకం చేసుకొన్నది. జాలిపడ్డది "మడిసిగందా" అని మాత్రమే పైకి అన్నది అప్రయత్నంగా ఆమాటఅంటూ అనుకోకుండా అందరివంకా చూచింది. గడియసేపు అల్లాగే నిలబడిపోయింది అంతలో ముందుకు వెళ్లింది.

"ఒసేవ్ రంగమ్మా—జాగ్రత్త తాకేవ్ సుమా నీకూ అంటుకోగలవు.. ఆ రోగాలు" అని మునసబుగారికి పెదవిదాకా వచ్చాయి మాటలు. మాటలైతే పెకిలి రాలేదుకాని అడుగులు మాత్రం ముందుకు పడ్డాయి. హెచ్చరించి ఆమెను వారిద్దామనే ఆయన ముందుకు వచ్చారు.

ఆలోపలే రంగమ్మ పడిపోయిన మనిషిని బలవంతంగా లేవదీసింది. గుడ్డతో ముఖం తుడిచింది. వెంటఉన్న పాలేరు కుఱ్ఱవాడి సాయంతో అతన్ని నడిపించుకొని సరాసరి తన యింటికే బయలుదేరింది.

వెంట వెంటనే కష్టాలలో పడి, తెప్పరిల్లుకోలేక, నట్టనడి దుఃఖ సముద్రంలో పడి, దుర్భరమైన హృదయ భారంతో మునిగి, మునకలు వేసి, కృంగి కృశించిపోయి, పెనుతుఫానుగాలికి వేళ్ళతోసహా పెకలించుకుని విరిగిపడి కొట్టుకొని పొయ్యే చెట్టులా సాగలేక సాగుతున్న వ్యక్తి తటస్థపడినప్పుడు ఒక చేత్తో అతని నడుము పెనవేసి మరో చెయ్యి అతని భుజం మీద వేసి, ఆదరాభిమానాలు చూపి కొంచెం ఆసరా కల్పించి అతనితో పాటు ఒక్క పది అడుగులు— కొంచెం ధైర్యం చెబుతూ అతన్ని నడిపిస్తూ—ఒక్కపది అడుగులు నడిస్తే చాలు ఇంక అతనే నడుస్తాడు, ఇంక సొంతంగా సవ్యంగా నడుస్తూ ముందుకు వెళ్ళిపోతాడుఆ వక్తి.

బుచ్చెయ్యకు అటువంటి ఆసరా దొరకలేదు అప్పటిదాకా.

రంగమ్మ అలా అతన్ని నడిపించుకొని వెళుతుంటే ఎవరూ అడ్డుపడి వారించలేదు. కొంచెం ముందుకు వచ్చిన మునసబుగారికి ధైర్యం లేకపోయింది, కాని వాళ్ళు ఆమెకు వినిపించేటట్లే అన్నారు అందామని అనుకొన్న— అనకూడని రెండు మాటలూ.

"దీనికొచ్చిందిరాజాలి!
వీడు దీనికి రెండో... కాబోలు!"

రంగమ్మ ఒకసారి వెనక్కు తిరిగి చూచింది. మునసబుగారి

గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ఆయన పెద్దకొడుకు మరీ బెదరి పోయ్యాడు. పీతలా ప్రక్క-ప్రక్కలకు నడుస్తూ పిల్లిలా జారుకొన్నాడు. ఆ తండ్రి కొడుకులను మరికొందరు మరింత నిశ్శబ్దంగా నడుస్తూ అనుసరించారు.

రంగమ్మ అంటే వారికి అంతభయం.

ఆమె పెదవి కదిపితే...

ఆ పెద్దమనుష్యుల పరువులు పోతాయి. వాళ్లు అతి విలాసంగా, దర్జాగా కప్పుకొన్న బూటకపు మర్యాద, అబద్ధపు ప్రతిష్ట అనే ముసుగులు ఇట్టే తొలగి పోతాయి. మరోమాట ఆమె నోటివెంట వస్తే అందరి బండారాలూ బయట పడిపోతాయి.

ఆ విషయం రంగమ్మకు తెలుసు.

అంతకంటె బాగా వారికీ తెలుసు ఆ విషయం. ఎవరెవరి బ్రతుకులు ఎలా ఎలా గడిచాయో ఆ భోగట్టాఅంతా ఆవిడకు కంఠోపాఠం. తారీఖులు, ఘడియలతో సహా వారి రహస్య జీవిత చరిత్ర విశేషాలు. గ్రంధాపేక్ష లేకుండా ఆధారాలతో సహా చెప్పేస్తుంది కావాలీ అంటే కానిఅదంతా కడుపులో పెట్టుకొన్నది రంగమ్మ.

"వీళ్ళా నన్ను వెక్కిరించేది—అదీ అవతల మనిషి చావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో సాయం వస్తేనా వెక్కిరించేది!" అనుకొన్నది రంగమ్మ తల పంకిస్తూ.

రెండు వేల రూపాయలు ఆ గ్రామంలో పాఠశాలా భవన నిర్మాణం కోసమని తన దగ్గర విరాళంగా పుచ్చుకొని చాటుగాకొందరూ, బహిరంగంగా కొందరూ గొప్పగా చెప్పుకొన్నారు. అలా అనేకవిధాల ఆమెను ప్రశంసించిందీ ఆ జనమే. మంది సొమ్ము అధికారులు అందరి ఎదుటనే నిర్భయంగా ఆరగించేస్తుంటే తను పైకి వ్రాయిస్తే దుమ్మెత్తిపోసిందీ ఆ జనమే. తను నీతిగా మొగుడి చాటున బ్రతుకుతున్న రోజులలో లేని

పోని భ్రమలు కల్పించుకొని తన వెంటపడి—ఒకసారి తాడితోపులోతన్ను ఒంటరిదాన్ని చేసి చెయ్యిపట్టుకొన్నాడాయన. తాను విదలించుకొని నీకిదేం కాలమని తిడుతున్నా లెక్కచెయ్యక, ముసిముసి నవ్వులు నవ్వుతూ అంతలో హఠాత్తుగా అమాంతం దగ్గరకు లాక్కొంటే గింజుకొని బాహుబంధం నుంచి తప్పించుకొని కోపం, రోషం పట్టలేక దిమ్మతిరిగే టట్లు చెంపదెబ్బ కొట్టింది. ఆ దెబ్బ తిన్నవాడూ అతనే, ఆ అధికారే. అతనే తను అనాథయై తిండికీ గుడ్డకూ కరువై దిక్కుమాలిన స్థితిలో ఉండగా పరిహసించిందీ అతనే. తను ఆనాడు దీనస్థితిలో ఉండగా ఒక ఆసామి చేరదీస్తే—గతిలేక-మరో గత్యంతరం లేక ఆయన పంచనచేరి ఆయన ఆదరణలో చాటుగా తన మానాన తను పడి ఉంటే 'చిన వెంక టప్పయ్యను ఇట్టే బుట్టలో వేసుకొందిరా—చూచారర్రా ఎంత మాయ లాడో—మళ్ళీ మనముందు మహా ప్రతివ్రత వేషాలు! అని పదిమందిలో తన్ను పదే పదే వెక్కిరించిందీ అతనే—అతనూ అతని సహచరులే. రంగమ్మకు ఆజనమంటే లెక్కలేదు. అంతేకాదు ఎందరిఇంటిరహస్యాలు తన గుప్పెట్లో ఉన్నాయో ఆమె ఎరుగును, వారూ ఎరక్కపోలేదు ఆ విషయం. అందుకే ఆమెకు అంత నిబ్బరము. అందుకే వారందరికీ అంత భయం కూడానూ.

సౌందర్యం వింతగా ఝురులుగట్టి ఒడలంతా ప్రవహిస్తున్న వయస్సులో, మంచి ఆరోగ్యవతియై దేహయష్టి గలదై, హాయిగా మగనితో సంసారం చేస్తూ నిశ్చితంగా గడుపుతూఉన్న మనిషి అంతలో దిక్కులేని పిట్ట అయిపోయింది. తాళి గట్టిన మగడు అకస్మాత్తుగా చనిపోయేసరికి కుప్పకూలి పోయింది. పాకముందు ఏడుస్తూ కూర్చున్న మనిషి వారాలు, నెలలు ఏడుస్తూనే ఉన్నది. మగడు పోవడంకంటె ఆడదానికి మరింత దరిద్రం ఏముంది-ఇది తీరే దరిద్రమా అనుకొని కుమిలి కుమిలి ఏడ్చింది. కొన్నాళ్ళకు పైకి ఏడ్వటం మానివేసింది.

తిండీ తిప్పలు మానుకోవడంతో చిక్కి శల్యం అయ్యింది.

మగడు ఉన్నంతకాలం పెద్దగా ఉండి దర్జాగా గడువకపోయినా ఏదో గడిచి పోయింది. ఉన్నదో లేదో బయటవాళ్ళకు ఏమాత్రం తెలియ నీయకుండా ఎంతో గుట్టుగా సంసారం గడుపుకొని వచ్చింది. అటువంటిది మగడు పోయిన కొద్దికాలానికే బతుకు బజారు పాలయ్యే స్థితి వచ్చింది. కొన్ని రోజులు ఉన్నవి అమ్ముకొని తిన్నది. ఏదో పనిచేస్తే గడవక పోదని తెలుసు కాని అందుకు తగిన మనః స్థితిలేదు.

ఏడుస్తూ, ఉపవాసాలు చేస్తూ, కటిక దారిద్ర్యం అనుభవిస్తూఉన్న సమయంలో ఉట్టినే జాలిపడి అప్పయ్య ఆమెను చేరదీశాడు. ఆశ్రయం కల్పించాడు. ఎంతో అదరించాడు. లాలించాడు. హఠాత్తుగా కలిగిన అపద నుంచి తేరుకోడానికి ఆమెకు ఏడాది పట్టింది. ఆమె క్రమంగా దుఃఖం మరచిపోయింది. అప్పయ్య పట్ల సద్భావం కలిగింది. "ఈ రోజుల్లో నాలాంటి వాళ్ళు కొందరు మారు పెళ్ళి చేసుకోవటం లేదూ ఇదీ అల్లానే అనుకొందాం" అనుకొని తనకు తాను సర్ది చెప్పు కొన్నది.

అలనాడు అల్లా అప్పయ్య చేరదీస్తే ఆయన పంచన చేరి రంగమ్మ ఆయన ఉన్నంత కాలమూ పదిహేనేళ్ళు నిశ్చితంగా, నిక్షేపంలా కాలం గడిపింది. నీతిగా బతికింది.ఆయన పట్ల విశ్వాసంతో వినయవిధేయతలతో మసలుకొన్నది. తన్ను చేరదీసే నాటికి ఆయన వయస్సు నలభై అయిదు. తనకు పద్దెనిమిదేండ్లు. తన వయస్సుతో పోల్చుకొంటే. ఆయనది పెద్ద వయస్సే అయినా ఆయన్నే నమ్ము కొన్నది. ఆయనకు ఇట్టే వచ్చేసింది వార్ధక్యం. ఆయన పోతూ పోతూ "నీవింకా చిన్నదానివేనే నిన్ను సుఖపెట్టే యోగం నాకులేదు. నీ బుద్ధి మంచిదే. తప్పో ఒప్పో అప్పుడో పని చేశాను. దానికి నువ్వు కట్టుబడి ఉన్నావు. ముప్ఫై రెండు ముప్పై మూడు ఏళ్ళు ఆడదాని కేమంత పెద్దవయస్సుకాదు. నిన్నీ స్థితిలో వదిలేసి పోతున్నా.

ఒంటరిగా ఎల్లా బ్రతుకుతావే. ఎవరికి కవులుకు ఇచ్చినా తిండికి నాలుగు గింజలువచ్చేందుకు కాస్తపొలం,ఉండడానికిఓయిల్లూ లేకపోతే నీబ్రతుకేం గాను ! అంటూ ఆయన జాలిపడి ఆమె పేరున నాలుగు ఎకరాలమాగాణీ వ్రాసి. ఆమె ఉంటున్న పెంకుటిల్లు కొని ఇచ్చి వెళ్ళారు. ఆయన సంతోష పూర్వకంగా ఏది ఇస్తే అది పుచ్చుకొన్నదే కాని నాకిది కావాలని ఆయన్ను బాధించికానీ,మోసగించికానీ తీసుకోలేదు. అల్లా కాజేయాలన్న బుద్ధి ఉంటే ఆమె ఏనాడో బోలెడు ఆస్తి సంపాదించేది. ఆయన ప్రాపు లభించిన కొద్ది కాలం తర్వాత నుంచీ ఆవిడ దాదాపు స్వతంత్రంగా బ్రతికింది. మొదట ఒక గేదెను పెట్టుకొన్నది. క్రమంగా అయిదు గేదెలూ, నాలుగు ఆవులూ దొడ్లో చేరాయి. వాళ్ళూ వీళ్ళూ ఆమెఇంటికే వచ్చి పాలు పోయించుకొని పొయ్యేవారు. కొన్నాళ్ళ తర్వాత పాలెవాణ్ణి పెట్టుకొని బస్తీకి పాలుపంపడం మొదలుపెట్టింది. కష్టపడి పని చేసుకొని కాలం గడిపింది, వీటి అన్నింటికీ కొంచెమో గొప్పో ఆయన మదుపు ఉన్నది. ఆయన బుద్ధి పుట్టినప్పుడు అటు ఇంటికి వెళ్ళినట్టుగానే ఇటు ఈమె ఇంటికి వస్తూ ఉండేవారు. సరదాకైనా నాకీ చీరకావాలని ఆమె ఎన్నడూ ఆయన్ను అడగలేదు. అల్లా గడిచింది.

ఆయన ఉన్నంత కాలమూ ఆమెకు కాలం ఎల్లా గడిచింది ! మరొకరు ఆమెను కన్నెత్తి చూడడానికి గుండెలున్నాయా ! అథవా ఎవరూ లేనప్పుడు ఎవడైనా అలా చూచినా అడుగు ముందుకు వెయ్యగలిగాడా ?

అయితే అటువంటి బుద్ధి ఉన్న వాళ్ళు కొందరు మొదట్లో ఆమె వంక ధైర్యం చేసి కొంటెగా నవ్వుతూ చూడక పోలేదు. ఆమె దించిన తల ఎత్తకుండా వెళ్ళిపోతున్నా చూపులతో వెంటాడుతూ ముసిముసి నవ్వులు నవ్వుతూ ఆమెను బాధించక పోలేదు.

వాళ్ళ ప్రవర్తన దుర్భరంగా ఉండేది. ఆమె అందుకు లోలోపల

ఎంతో బాధపడుతూనే ఉండేది. తాను తప్పు-తప్పే చేసింది. అది వాస్తవమే. అనుశ్రుతంగా వస్తున్న ఒక సత్సంప్రదాయాన్ని తప్పి ఒక అడుగు ప్రక్కకు వేసింది. మరొక గతిలేక, అనాయాసంగా లభించిన ఆశ్రయాన్ని ఆదర్శంకోసం విడిచిపెట్టుకోలేక ఒకానొక మార్గంలో నడిచింది. అది సర్వోత్తమమైన మార్గం కాదని ఆమెకూ తెలుసు. కాని ఆ మార్గంలో,ఆనడకలో సాధ్యమైనంతవరకు నీతిగానే మసలుకొన్నది. నిజాయితీగానే బ్రతికింది. అది అందరికీ తెలుసు. తెలిసి కూడా కొందరు తనవంక ఆల్లా చూడడము ఆమెకు చాలా బాధ కలిగించేది. చూడడమే కాదు. "ఏమే ఆయన నీకేమైనా అయినవాడా ? వయసులో ఉన్నవాడా ? అతగాడి కంటే ఎక్కువే ముట్టచెప్పగలనులే నేను" అన్నాడు ఒకరోజున ఒకాయన.

ఆ అన్నవ్యక్తి చిన్నవాడేమీకాదు.ఏదో వ్యామోహంలో తెలియక అన్నాడనుకోడానికి. ఆయన అప్పయ్యకంటె రెండు సంవత్సరాలు పెద్ద వాడే. అప్పయ్యకు జుట్టు అక్కడక్కడ నెరిస్తే అతనికి జుట్టంతా ముగ్గుబుట్టలా అయింది. పాతికేళ్ళ నుంచి సంసారం చేస్తున్న వాడే. ఇంతో అంతో ఆస్తి కూడా ఉన్నవాడే. నలుగురిలో గౌరవంగా తిరిగే వ్యక్తే అతను.

అందుకే రంగమ్మ మరింత బాధ పడ్డది. ఆ మాటలు విని కూడా సమాధానం చెప్పక అక్కడ నుండి మెల్లగా జారుకొని, వడివడిగా ఇంటికి చేరుకొని, రాత్రిదాకా తిండీ తిప్పలు మానుకొని ఏడుస్తూ కూర్చుండి పోయింది. "ఇంతకంటే ఏమి కావాలి నాకు అవమానం" అనుకొని రోషపడి పోయింది. అప్పుడతన్ని ఏమీ అనలేక పోయి నందుకు ఉక్రోషం భరించలేక పోయింది.

ఆ రాత్రికి అప్పయ్య వచ్చి చూచేసరికి ఆమె ముఖం కందిపోయి ఉన్నది. కళ్లు వాచి ఉన్నాయి. చెక్కిళ్ళపై మందారాలు పూచినట్లుగా

ఉన్నది. ఆ మందారాల మీదుగా నెమ్మదిగా జాలు వారుతున్న మంచు నీటి బిందువుల్లా ఆమె చెక్కిళ్ళపై నుంచి కన్నీటి బిందువులు జారుతూనే ఉన్నాయి.

అప్పయ్య ఆ దృశ్యం చూచీ చూడగానే "అదేమే అల్లాఉన్నావ్! ఎందుకలా ముఖం అంతా కందగడ్డ అయ్యేలా ఏడుస్తున్నావ్? ఏమిటది? ఏం జరిగింది?" అంటూ వెయ్యి ప్రశ్నలు వేస్తూ గాభరా పడిపొయ్యారు. ఆయనకు చాలా బాధ కలిగింది. ఇంత ఎత్తున పొంగిన బుగ్గలపైన ధారలు కడుతున్న కంటినీటిని తుడువాలని ప్రయత్నం చేస్తూ ఆమెను ఓదార్చడానికని దగ్గరకు తీసుకొన్నారు. ఆమె దూరంగా జరిగి మూలకు పోయి కూర్చుని మళ్ళా వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టింది.

ఏమి జరిగిందో చెప్పమని ఆయన చాలా సేపు బ్రతిమిలాడారు. ఎన్నో విధాల బలవంతపెట్టారు కారణం చెప్పమని. చివరకు గట్టిగా కోప్పడి చెప్పక తప్పదని పట్టు పట్టారు.

అప్పుడు "ఆయన ఇల్లా అన్నాడండీ" అని జరిగిన విషయం చెప్పక తప్పింది కాదామెకు. చెప్పి- "నేనూ మిదగ్గర ఉంటున్నానను కోండి.... అయితే ఆయన ఎక్కువ డబ్బిస్తే...." అని ఆగిపోయి ఏమో చెప్పాలనుకొని చెప్పలేక దుఃఖం పొర్లివచ్చి పెద్దగా ఏడ్చింది.

'ఎంత దిక్కులేని దాన్నయినా అంత నీచురాల్నిగా జమకట్టే స్తారా? 'అని వల వలా ఏడ్చింది. ఆయనకు పట్టరానంత కోపం వచ్చింది. అంత కోపంతో ఆయన్ను బయటకు వెళ్ళనిచ్చే ఉంటే ఆవిషయం ఎంత దూరం వెళ్ళేదో! రంగమ్మ అడ్డుపడది.

"మీకు దణ్ణం పెడతా మీరింక ఊరుకోండి – ఇంతటితో పోని వ్వండి – నా ఖర్మం – నారాత ఇల్లా వ్రాసి ఉంది గనుక వాళ్ల అన్నా పడి ఊరుకొంటా. మీరేమీ చెయ్యవద్దు...నన్ను మరీ బజారున పెట్ట కండి. మీకు పుణ్యం ఉంటుంది." అంటూ అడ్డుపడి బతిమాలుకొన్నది'

ఆయన వినక ఆవిడను అవతలకు నెట్టి వాడి వ్యవహారం ఏమిటో నేను చూస్తా నువ్వెందుకు అడ్డు తగులాతావంటూ దురుసుగా వెళ్ళిపోతుంటే వాడితల చెడుతుందేమోనన్న భయంకలిగి వాడిమీద జాలిగలిగి హృదయం కరిగిపోగా ఆయన కాళ్లు పట్టుకొని ప్రాధేయ పడ్డదానాడు రంగమ్మ.

నా ఆత్మకు తృప్తిగానే ఉంటున్నాగా-వాళ్ళనెందుకు శిక్షించడం. అనుకొని తాను సమాధానపడి ఆయన్ను సమాధానపరచింది. రోషం అవమానం చంపుకొన్నది. వాళ్లు ఎల్లా చూచినా తాను ఒకర్ని కన్నెత్తి చూచిందా!

చూడటం లేదుగదా అని వాళ్ళు మానేశారా? ఉత్సవాలలో— ఊరేగింపులలో పెద్దవాళ్ళము అని చెప్పకొని తిరిగే మనుష్యుల అసలు స్వరూపాలు – వారి వారి కక్కుర్తి స్వభావం బయటపడుతుంది. పరాయి ఆడవాళ్ళను కాస్త రాసుకు తిరిగే అవకాశం చిక్కేసరికల్లా-ఏమో ఒరిగి పోయినట్లే ఆ మనుష్యులు ఒరగబడి పోతారు. విరగబడిపోతారు. వింత వింత విలాసాలు పోతారు.

అక్కడికి ఎందుకు వచ్చినట్లో!

తాము ఏమిచేస్తున్నట్లో!

అదికాదు – ఒంటరిగా దగ్గర అయిదారు ఫర్లాంగుల – కేకవేస్తే అందే దూరంలో – అడ్డుకోగల మనుష్యులు లేనప్పుడు అందమైన ఆడది కన్పించినప్పుడు – అప్పుడు మనస్సు చలించకుండా ఉండాలి. దురూహలు చెయ్యకుండా ఉండాలి. అడుగో అతనూ పెద్ద మనిషంటే అల్లా అనుకొనేది రంగమ్మ. అల్లా అనుకుంటూ ఈ మనుష్యుల్ని చూచి నవ్వుకొనేది. అలా నవ్వుకుంటూ ఆమె ఉత్సవాలకూ ఊరేగింపులకూ వెళ్ళేది.

రంగమ్మ అందరుసంసారస్త్రీలకంటె మరొక్క పిసరు స్వేచ్ఛగా

మెలిగేది. కొందరితో అవసరమైతే ఎదురుపడికూడా మాటాడేది. అప్పయ్య కూడా అందుకు ప్రోత్సాహం ఇచ్చేవారు.

అంతచేటు ఘోషా దేనికీ — గుణం ప్రధానంగానీ. చెడిపోవడానికి అన్ని అవకాశాలూ ఉన్నప్పుడు చెడకుండా ఉంటే — అప్పుడు నువ్వొక మంచిమనిషివికాని నిన్నొక నల్లరాతి కట్టడంలో పెట్టి తాళాలు బిగించి మనుష్యుల్ని దాపుకు రానీయకుండా భయపెట్టి అప్పుడు నువ్వొక మహా పతివ్రతవని నే ననుకోవడమూ, నన్ను తప్ప మరొకర్ని కన్నెత్తి చూడడం లేదని మురిసిపోవడమూ ఏమిటి గొప్ప" అనేవారాయన తరచు.

రంగమ్మ స్వేచ్ఛగా బ్రతికింది.

ఆమె తానొక పెద్ద పతివ్రతా శిరోమణినని ఎన్నడూ తాను అనుకోనూలేదు. అందరూ అలాఅనుకోవాలనో, కనీసం అనుకొంటున్నట్లు నటించాలనో ఆమె కోరుకోనూలేదు. పెళ్ళిళ్ళకూ పేరంటాలకూ పిల్చి ముత్తయిదువ వాయనం ఇచ్చి తన్ను గౌరవించాలని ఆమె ఆశించలేదు. 'కాని వాళ్ళంతా ఆడవాళ్ళూ మగవాళ్ళూ — ఏదో నా బ్రతుకు నన్ను బ్రతకనీయక — నావంక అంత అనుమానంగా. వెక్కిరింతగా చూడ వలసిన ఆగత్యం ఏమివచ్చిందీ ? చాటుగా ఆడిపోసుకోవడం దేనికి ? గతం కొంత దుఃఖభాజనమై. కంటకావృతమై. కష్టాల కడుడై. బాధించి నప్పుడు — భర్తృవిహీననై ఒంటరి దాననై ఉన్నపుడు. కొంత కాలం ఆ బాధలన్నీ అనుభవించి భవిష్యత్తును ఊహించియైనా ఉజ్జ్వలము చేసుకోవద్దా ? సాధ్యపడితే ఉన్నతమూ ఉజ్జ్వలమూ సౌఖ్యవంతమూ చేసుకోవడం తప్పా ? ఆయనగారి అండ దొరికితే నేను సుఖపడతా ననుకొన్నాను. అల్లా గయినా సుఖంగా బ్రతుకుదామనుకొన్నాను. దైవం అనుకూలించాడు. వారి పంచను చేరాను. సుఖమో కష్టమో నా బ్రతుకు ఓలాగా గడుస్తోంది. అందుకు వీరంతా ఇల్లాఅనుకోవడం దేనికీ ?'

అల్లా ఉండేది ఆమె ఆలోచన.

"పోనీ వాళ్ళమాట నా కేల_నా సంగతి వాళ్ళకేల? అనుకొని దులబరించుకొనే గడుపుకొనిపోతూ ఉండేది. కాని అదీ అంత తేలికైన పనిగాదు. పెద్ద బస్తీలో అయితే పరాయివాళ్ళ మాటల్నీ చూపుల్నీ—మూతివిరుపుల్నీ దుష్ప్రయత్నాలనూ లెక్క_చేయవలసిన ఆ అవసరము ఉండేదికాదు. కాని ఆమె ఉన్నది కుగ్రామం. గ్రామాల్లో అటువంటివాటి నుండి తప్పించుకొని పోవడం కష్టమైనపనే. అయినా సాధ్యమైనంత వరకు నేర్పుగా - తప్పించుకొని నిర్భయంగా తిరుగుతుండేది రంగమ్మ.

x x x

రంగమ్మ వట్టి బోళా మనిషి.

ఆమె ఔదార్యం ఆమె ప్రేమా నిగూఢమైనవి.

ఆమెకు నటన చేతకాదు.

కొందరు నటిస్తారు. సానుభూతి తమకు సహజగుణమన్నట్లుగా తాము గౌరవనీయులూ, ఉదారులూ అయినట్లుగా — తాము పరమ పవిత్రులుగా జీవయాత్ర సాగిస్తున్నట్లుగా గొప్పగా నటిస్తారు.

కాని లోలోపల ఏదో భయం - బాహిరానికి నటన. ఒకామె తన సవితి బిడ్డల్ని ఉట్టి పుణ్యానికి బాధిస్తూ ఊరివారి పిల్లల్ని చంకనవేసుకొని ముద్దాడుతూ నాలుగుచోట్లకూ తిరుగుతూ ఉంటుంది. ఒకామె రోడ్డువెంట వెళుతూ - సిగ్గు ఎందుకో అర్థంకాదు. పమిటికొంగు పదిసార్లు బారగా లాక్కొని ఒడలంతా కప్పుకొని_ఆ రోడ్డుకు మరీ చివరగా ఒదిగి ఒదిగి నడుస్తుంది. తానొక మహా పతివ్రతఅనీ తనకు పదిమందిలో నడవడ మంటేనే అంత అభిజాత్యమనీ అందరూ అనుకోవాలని ఆమె ఉద్దేశ్యం.

ఒకాయన ఏదో పెద్ద పని ఉన్నదని చెప్పి వెళ్ళి, వేశ్యతో చవక బారు శృంగారం వెలిగించి వచ్చి - తన దౌష్ట్యం బయటపడుతుందేమో

వని ఇంట్లో భార్యతో అధికమైన ఆపేక్షగా అంతకు ముందెన్నడూలేనంత ప్రేమగా మాటాడతాడు. ముద్దులు కురిపిస్తాడు.

ఒకాయన బస్తీవెళ్ళి నానాతిళ్ళూ తిని — అడ్డమైన మ్లేచ్ఛ కొంప ల్లోనూ నీళ్ళు — నీళ్ళేమి ఖర్మం అధరామృతాలు సేవించివచ్చి, ఇంట్లో పిల్లల్ని చూచి — "ఒసేవ్ పిల్లా బొట్టు పెట్టుకోవేమే వెధవ పిల్లలా. ఒరేయ్ జందెమేదిరా మరీ నా స్తికుడవై పోతున్నావ్" అని తిడుతూ జపం చేస్తాడు అర్ధగంటసేపు—అన్నం వడ్డించాకకూడా. మరొకాయన దేవాలయ ముఖద్వారంలోనే నిలబడిపోయి టఫీ — టఫీమని అందరికీ వినిపించేలాగున లెంపలు వాయించుకొంటూ "రామా రామా— క్షమించు నాయనా" అని ప్రార్థనలుచేస్తాడు. శ్లోకాలు మొదలు పెడతాడు భక్తి పారవశ్యంలో మునిగి పోతున్నట్లు. అదేమండీ—మీరేం పాపం చేశారండీ అనిసన్నిహితులెవరైనా అడిగితే "అబ్బే వేరే పాపమంటూ ప్రత్యేకంగా చెయ్యాలా ఏమిటి? అసలు మనిషిగా పుట్టడమే మహాపాపం. ఊరికే నడుస్తుంటే ఎన్ని చీమలు చస్తున్నాయో, మనకు తెలియకుండా ఎన్ని పాపాలు చేస్తున్నామో అంటూ వాపోతాడు. కేవలము బుద్ధభగవానుని శిష్యుడిలాగ.

కాస్త తొంగిచూస్తేసరి.

ఆయన సతీమణిగారి చెక్కిళ్ళు రోజుకు మూడుసార్లు వాస్తూ ఉంటాయి. పనిమనిషికి అన్నం ఎక్కువ పెట్టిందనో, వారాల కుర్రవానికి నెయ్యి కాస్త ఎక్కువ వేసిందనో.

ఇల్లా ఉంటుంది నటన.

రంగమ్మ కా నటన చేతకాదు. ఆమె ఎన్న నటించలేదు. తాను చేసిన ఒక పని తప్పేనన్నది. బహిరంగంగానే ఒప్పుకొన్నది. తప్పు కాదనిపించేలాగున నటించలేదు, అన్యులను తన దగ్గరకు ఎన్నడూ చాటుగా రానీయలేదు. తను వీధివెంట వెళ్ళితే నింపాదిగా హుందాగా

మంచి చీర కట్టుకొని నగలూ, పూవులూ పెట్టుకొని అంచక్కా అలంకరించుకొనే వెళ్ళేది. తరచు గుడికి వెళ్ళివస్తుండేది. కన్న బిడ్డలు లేకపోయినా తాను పెంచుకొన్న ఆ ఒక్క పిల్లనూ కన్న సంతుకంటె ఎక్కువ ఆపేక్షగా చూచుకొనేది. ఆ పిల్లకు ఆమె ఏమి పెట్టిందో ఏమి చేసిందో రెండో కంటికి తెలియదు. ఆ పిల్ల ఏపుగా పెరిగి నవనవలాడింది. త్రాచులా మిలమిలలాడింది కాస్త వయస్సువచ్చేసరికి.

ఊరివారి పిల్లలకు పెట్టినా చాటుగా పెట్టేది. కొందరు ధర్మాలు చేస్తే...వస్త్రదానం చేస్తూ ఆ గుడ్డముక్కలపైన ఫలానావారి ధర్మమని చెరగని సిరాతో ముద్రలు వేయిస్తారు.

ఆమె ఇరుగుపొరుగున ఉండే బీద సంసారాల్లో పెరిగే పిల్లలకు చొక్కాలూ, గౌన్లూ కుట్టించి అతి రహస్యంగా ఇచ్చేది. అవి వాళ్ళు కట్టుకొని తిరుగుతుంటే లోలోపల సంతోషించేది. అమెచేసిన ఉపకారాలు ఎవరూ గుర్తించలేదు. జ్ఞాపకంఉంచుకోలేదు. ఏనాడో ఋణపడి ఉన్నది అది ఈనాడు తీర్చుకొంటున్నది అనుకొన్నట్లుగా ఊరుకొనేవారు! అయినా ఆమె స్వభావం మారలేదు. "ఎందుకే వాళ్ళకిదంతా చేస్తావ్ — వాళ్ళు నిన్ను అల్లా అంటున్నారుకదా!" అని హెచ్చరిస్తూ ఉండేవారు అప్పయ్య. ఆమెచిరునవ్వునవ్వి ఊరుకొనేది.

X X X

ఆమె కునటనాచేతకాదు. దబాయించడమూ చేతకాదు.

కొందరు కొన్ని తప్పులు చేస్తారు. సంప్రదాయాన్ని అతిక్రమిస్తారు. అల్లా చేస్తూ అది తమ సిద్ధాంతమంటారు. వారు కాస్త తెలివిగలవారైతే వాదాలు లేవదీసి, శిష్యుల్ని పోగుచేసుకొని తమ్ము తాము సమర్థించుకొంటారు. తమ క్రొత్త సిద్ధాంతాలను ప్రచారం చేసుకొంటూ మరింత స్వేచ్ఛగా ప్రవర్తిస్తారు. చెల్లినంత కాలమే చెల్లుతుంది. చెల్లని నాడు బయటపడి—ఓడిపోయాము. మా మార్గం మార్చేసుకొంటున్నాంఅనేస్తారు.

రంగమ్మకు అల్లాంటి సిద్ధాంతాలూలేవు. తన్ను తాను సమర్థించు కోనూలేదు. అందువల్లనే ఆమె మానసికంగా చాల బాధపడ్డది. తిండికి బాగా గడుస్తున్న రోజుల్లో—అప్పయ్య తన్ను ఆదరించి ఆపేక్షగా చూస్తున్న రోజుల్లో కూడా.

కాని సంఘంలో అంతమందీ ఒక్కలా కోడై కూస్తే, తనపై పగపట్టి ఉంటే ఆమె స్థితి మరోలా ఉండేది.

కొందరు మనకెందుకని ఊరుకొన్నారు. అసలావిడ విషయమే వారి ఆలోచనకు వచ్చేదికాదు. ఏదో ఒకచోట నిలకడగా ఉన్నదిగా — అందువల్ల వచ్చిన నష్టం ఏమిలేదులే అనుకొని ఊరుకొన్నారు. మరికొందరు 'ఆ తప్పు దిద్దుకొని మళ్ళీ సరియైన మార్గం లోకి వచ్చేస్తే దానంత మంచిమనిషి మరెవరుంటారూ! అబ్బే అది అల్లా ఉండిపోవడం బావుండలా అని వారు వారివారి అంతరాల్లోనే విమర్శించు కొని ఆ ప్రస్తావన వచ్చినప్పుడు ఒకటి రెండు మాటలు మాటాడి ఊరుకొనేవారు. ఆ మాటలు ఎక్కువ కటువైనవికావు. అపకారాన్ని వారెప్పుడూ తలపెట్టనూలేదు. వారైనా కావాలని ఆమెకు ఏ ఉపకారం చెయ్యడానికి పూనుకోలేదు. ఆమెకు మార్గాంతరాలు — ఏ వివాహం చేసు కోవడమో మరోవృత్తి, మరో ఆధారము కల్పించడమో అల్లాంటివేమీ తలపెట్టలేదు.

మరికొందరు ఉన్నారా ఊళ్ళో.

వారి కొక్కటేపని. ఎత్తిపొడవడమేపని. తామే ఆ గ్రామ నిజాయితీకి — మూలస్తంభాలయినట్లూ, సంస్కారము చేయగల, ఇతరుల తప్పును బహిరరగపరచి విమర్శింపగలఅధికారమూ స్తోమతూ తమ కొక్కరికే కలదన్నట్లు మాటాడతారు. వారిలో మునసబుగారూ ఆయన పెద్దకుమారుడూ ఎన్నదగిన పెద్దలు.

మునసబుగారు నీతిని గురించి ఉపన్యసించినంత ఎక్కువగా

మరెవ్వరూ ఉపన్యసింపలేరు. అంత సావకాశమూ  ఓపికా మరెవ్వరికీ లేనట్లే అనిపిస్తుంది.

తమకు మచ్చలున్నాయన్న సంగతి  ఊరివారికి కొందరికైనా స్పష్టంగా తెలుసునన్న విషయం, ఆ యథార్థం వారెరిగి ఉండి  కూడా అలా స్వేచ్ఛగా మాటాడేస్తారు.

'ఏమో అంతకు ముందు  చిన్నతనంవల్ల నిజంగా  ఆయన మునసబుగారు ఆ పని చేశాడో లేదో లేక  ఊరికే ప్రజలు కిట్టక అల్లా కల్పించారో గాని అబ్బో ఆయన కసలు ఇటువంటివి గిట్టవురా ! ఆవిషయాలు ప్రసక్తి వస్తేనే చాలు చంపేస్తారు!' అని ఎదుటివాళ్ళు అనుకొనేటంతగా ఉంటుంది వారి విమర్శనాధోరణి.

వారికంటే ఏడాకులు ఎక్కువ చదివాడు ఆయన కుమారుడు.

తమకున్న లోపాలను గురించే - వాని ప్రసక్తే  ఎత్తి ఎంత గట్టిగా, పెద్దగా, గొప్పగా, తెలివిగా బలమైన  కారణాలను ఏకరువు పెడుతూ తరచుగా విమర్శిస్తే అంత సుళువుగా  తమ లోపాలు కప్పడిపోతాయని వారి నమ్మకం. ఎదుటివారిలో  ఎక్కడ ఏలోపము కన్పిస్తే దాన్ని పసిగట్టి ఆరాలు తీసి బయటకు లాగి తమకున్న కాస్త జ్ఞానం ఉపయోగించి విమర్శించి గోరంతలు కొండంతలుగాప్రచారంచేసి అల్లరి పెడితే తమ లోపాలు వారి లోపాలముందు చిన్నవిగా, అసలు వేలెత్తి జూపడానికి వీలులేనంతటి స్వల్పమైనవిగా కన్పిస్తాయని వారి ఎ ఆ ఎత్తు పారింది.

సామాన్యంగా ఆ ఎత్తు పారేదే,

నిజాయితీ అన్నది ఏనాడో మర్చిపోయి  అదృష్టం అవకాశం కలిసి రాగా  పదవిలోకి వచ్చి ప్రజలను స్మృతి పథంలో నుండి తొలగించుకొని, పనిచేసుకొని పోయే రాజకీయనాయకుడు - లంచగొండితనాన్ని గురించీ - దాన్ని సాంతం నిర్మూలించడానికి  కనుగొన్న

మార్గాలను గురించీ, సర్వ ప్రజల సౌఖ్యమూ – మొత్తము దేశ శ్రేయము గురించీ పనివేళా వెళ్ళి ఊరూరా బ్రహ్మాండమైన ఉపన్యాసాలు ఇస్తుంటే సామాన్య జనులు ఏమనుకుంటారు ?

అది ఒకఎత్తు. అదిపారుతుంది.

అందువల్లనే వీరిద్దరి మాటలూ ఈ ఊళ్ళో ప్రజలు చాలా మంది నమ్మడమూ–వారికి వంతపాట పాడడమూ జరుగుతూవచ్చింది.

ఎన్ని విధాల ఎవరు ఏమని అన్నా రంగమ్మ పడి ఉరుకొన్నది. తనకు సాధ్యమైనంతవరకు తన జీవితాన్ని సౌఖ్యవంతము చేసుకొన్నది. అంటున్నారని రోషపడలేదు. క్రోధం పెట్టుకోలేదు. తను నీతిగా బ్రతుకుతున్నా వారు వెక్కిరిస్తుంటే పోనీలే వారిమాటలు నాకేమి లెక్క అని జరీ అంచు చీరలు కట్టుకొని సొమ్ములు పెట్టుకొని తిగురుతూ తానింత తిన్నది. నలుగిరికింత పెట్టింది. తాను సుఖపడ్డది, అప్పయ్యను సుఖ పెట్టింది.

x x x

తనకు ముప్పైఏళ్ళు నిండుతుండగా తన్ను చేరదీసిన మనిషి పోతే ఆమె విపరీతంగా దుఃఖపడ్డది. పదిహేనేళ్ళ సాంగత్యం అనంతరం అప్పయ్య పోయాడు. ఆమెకు దుఃఖం ఆగక చాలా రోజులు, నెలలు ఏడ్చింది. తనకు తొలిసారిగా ఇట్టిబాధ కలిగినప్పుడు కూడా ఇంతటి దుఃఖాన్ని ఆమె అనుభవించలేదు. కావడానికి అతను భర్తే అయినా అతనితో తాను ఎక్కువకాలం గడపలేదు. తాను యౌవనవతియైన క్రొత్త రోజులవి. వ్యామోహం తప్ప అప్పటికి తనకేమీ తెలియదు. దారిద్ర్యం తప్ప మరోసమస్య లేదు ఆనాడు. కాని ఈనాడు ఆమె హృదయం ద్రవించిపోయింది. నిజమైన వియోగదుఃఖం కలిగింది.

ఆమె అంతటి దుఃఖంలో ఉన్నప్పుడు కూడా వెక్కిరించేవాళ్లు వెక్కిరిస్తూనే ఉన్నారు. "అసలు మొగుడు పోయినప్పుడు లేదుగాని

దుఃఖం...ఇప్పుడొచ్చిందిరా!" అని అన్నారు. 'అంటే అన్నారులే - వాళ్ళకేం తెలుస్తుంది. నేనీయన్ను ఎంతగా ప్రేమించానో - ఈయనకు నే నెంతగా ఋణపడి ఉన్నానో!' అనుకొని ఊరుకొన్నది. కాలం గడుపుకొని పోయింది. ముప్ఫైఏళ్ళకే తన్ను చేరదీసిన ఆమనిషి పోయాడుగాని క్రమక్రమంగా తనలో చేరుతూ వచ్చిన శరీర సౌందర్యం పోలేదు. ఆమె సౌందర్యం చెడలేదు. శరీర సౌష్టవం సడల లేదు. మళ్ళా వయస్సు వచ్చినట్లే ఉన్నది. ఇప్పుడామె చెక్కిళ్లలో పూర్వపు లేతగులాబీల అరుణిమ తాలూకు సొగసు లేకపోవచ్చును. ఆ కళ్ళల్లో ఆనాడున్న సన్న నినీలినీడల మిలమిలలు లేకపోవచ్చు. ఆనడకలో ఆనాటి ఒయ్యారము - ఉత్సాహము ఈనాడు కన్పించక పోవచ్చును. కాని మేని నిగనిగలు చెడలేదు. అది మరొక విధమైనది కావచ్చును గాని ఆవయస్సు తగ్గ క్రొత్తఆకర్షణకూర్చుకొన్నది. మనిషిలో నిండుతనం, హుందాతనము వచ్చింది. అల్ల ఆనాడు ఆమెను అందరూ అందకత్తె అనడానికి కేవలము పొంగి పొర్లుతున్న యౌవనమే కారణమైతే ఈనాడు ఆమె అందమైన మనిషి అనడానికి నిండుతనం కారణం అయింది. ముప్పైఫ సంవత్సరాల వయస్సు - వయస్సుచేత కొంత మార్పు వచ్చింది. నడుము కొంచెం విశాలమైంది. ఆ కనులలో కొంత మాంద్యం ఏర్పడింది. మనిషి కొంచెం ఒళ్ళుచేసింది. పరువులు తీసే ఉత్సాహం పోయింది.కాని లోనలోన మళ్ళీ యౌవనం వచ్చినట్లున్నది. అది ఆమెకే స్పష్టంగా తెలుసును. అయినా ఆమె ఆ కోర్కెల జోలికి పోలేదు. తిని కూర్చున్నా గడిచే స్థితి ఉండికూడా పనిపాటలు చేసింది. పాలూ పెరుగూ పూర్వంకంటె ఎక్కువగా పోగుచేసి బస్తీలో హోటళ్ళకు అందించి డబ్బు మూటకట్టింది.

తన చేతిక్రింద ఉన్న పిల్లను పాల వ్యాపారంలో పెట్టింది. మంచి తర్ఫీదు ఇచ్చింది. ఆ యిల్లు పాడీ పంటా చక్కదిద్దుకొనిపోగల

నేర్పు ఆ పిల్లకు అబ్బింది. ఆ పిల్లా సొమ్ములు పెట్టుకొని తిరిగింది. ఆ పిల్ల తప్పుడు మార్గంలో పడితే రంగమ్మేం చేస్తుంది ? ఆ దోషం ఆవిడదా!

మునసబుగారి పెద్దకొడుకు ఆ పిల్లతో చాటుగా సహవాసం చేసి ఆ పిల్ల అమాయికత్వం ఆధారంగా చేసుకొని దగ్గరకు చేరి క్రొత్త రుచులు చూపించి బస్తీలో దిగవిడచి వచ్చాడొక రోజున.

అందుకు రంగమ్మ చిట్టచివరకు అతన్నిగానీ ఆ పిల్లనుగానీ ఏమీ అనలేకపోయింది. అతను బతిమాలి బామాలి "మాది పెద్ద కుటుంబం మా అయ్య కోపదారి మనిషి" అని మొరపెట్టుకొంటే ఆ రహస్యం దాస్తానని ఒప్పుకొని ఆ మాటకు నిలబడ్డది. ఆ పిల్ల ఏడుస్తూ వచ్చి కాళ్ళమీద పడి వదలకపోతే ఈ తప్పు కాస్తా ఇంక సరిగా ఉండమని మందలించి ఆ పిల్లను కడుపులో పెట్టుకొన్నది.

'అయినా చావుబ్రతుకుల మధ్య ఉన్న మనిషితోనా నాకు రంకులు కట్టేది ! రామ రామ ఏం మనుష్యులు !' అనుకొంటూ ఆమె ముందుకు సాగింది.

రంగమ్మ కొందరు మనుష్యుల్ని చూచి అసహ్యించుకొనేది. కాని ఆవిడ చీదరించుకొన్నది ఆ వ్యక్తుల్ని కాదు. వాళ్ళ గుణాలను, మళ్ళా మనుష్యులంటే ఆమెకు ఇష్టమే. వారందర్నీ తాను సరిగానే చూచింది. వాళ్ళ రహస్యాలు, లోపాలు తనకు తెలుసుగదా అని ఎవర్నీ బాధించలేదు. నిజంగా ఆమెకు మనుష్యులంటే సానుభూతి ఉన్నది గనుకనే - ఆనాడు మోతుబరి రైతు కామయ్యగారి రెండో కూతురు ఒక చాకలి కుర్రవానితో బస్తీకి పారిపోతే తానే స్వయంగా వెళ్ళి పట్టుకొని వచ్చి ఉట్టిదేనర్రా అదేం పాపం చెయ్యలా సినీమాలో చేరాలని ఉన్నదట పిచ్చిపిల్లకు ఎల్లాగో బస్తీకి చేరి అక్కడ్ణించి పట్నం

పోదామనుకుంటోంది. అంతలో నేనే పట్టుకొచ్చానుగా అంటూ ఏవో సాకులు చెప్పి కప్పిపుచ్చింది. ఆ మాట తాను గడప గడపకూ పోయి చెప్పి వచ్చింది. అనాడు ఆమెను చాటుగా ఎంత వెక్కిరించినా విమర్శించినా ఆమె స్వయంగా బయటపడి ఏమన్నా అంటే ఆమాట చెల్లితీరాల్సిందేగాని మరోమాట లేదు. "ఈ పాడు ముండను నేను కొంపలోకి అడుగు పెట్టనివ్వను" అని కన్న తీపి పీకుతున్నా బెట్టు బోయి గుమ్మంలో అడ్డంగా నిలబడ్డ కామయ్యగారితో పోట్లాడి. ఆ పిల్లను ఇంట్లోకి నెట్టింది. మొదట్లో పొరుగువారొకరిద్దరు ఏమన్నా తర్వాత తర్వాత ఆ పిల్ల ఏతప్పూ చెయ్యనట్లే చెలామణి అయింది. మొదట్లో ఆ పిల్లను గురించి ఎవరైనా పల్లెత్తు మాట అంటే రంగమ్మ ఊరుకొనేదికాదు.ఆ పిల్లకు మూడేళ్ళ తర్వాత లక్షణంగా పెళ్ళయింది. అందరిలా కాపరానికి వెళ్ళింది,

ఒకసారి తప్పు చేసినంత మాత్రాన మనుష్యులు మనుష్యులు కాకపోరని రంగమ్మ ఉద్దేశ్యం.ఆనాడు ఆపిల్ల తల్లిదండ్రులు రంగమ్మను ఎంతగా మెచ్చుకొని సంతోషపడ్డారో ఆ పిల్లకు తెలుసు. కొంతగా రంగమ్మకు తెలుసు. పరాయివాళ్ళ కేం తెలుస్తుంది ?

పిల్లలంటే రంగమ్మకు ఎంత సానుభూతి? ఎంత ప్రేమ? పండగలు వస్తే పిండివంటలు చేసి బీద పిల్లలకు ఇళ్ళకు పంపేది. స్వాతంత్ర్యం వచ్చిన రోజున బళ్ళో పిల్లలంతా చేరి జెండా ఎత్తే సమయానికి తాను వారి ఆనందం చూచి పోదామని వెళ్ళి,రెండు గంపల నిండా కమలా పళ్ళు తెప్పించి గేటుదగ్గర నిలబడి ప్రతి పిల్లవాణ్ణీ పిల్ల దాన్నీ పేరు పేరునా పిల్చి పళ్ళు పంచిపెట్టింది. వాళ్ళంతా సంతోషంగా ఎగురుతూ, కేరింతలు కొడుతూ తనచుట్టూ తిరుగుతూ కాళ్ళకు చుట్టేసుకొని పోతుంటే పిచ్చి సంతోషం పట్టలేక. బొడ్డున దాచుకొని వచ్చిన రూపాయిలన్నీ అందరికీ ఇచ్చేసింది. వారంతా నవ్వుకొంటూ

కేకలువేస్తూ ఆడుకొంటూ ఊళ్ళో కొట్టువైపుకు పరుగెత్తుకొని వెళ్ళిపోతే గేటుదగ్గరే బండమీద ఒక్కర్తే కూర్చొని ఎంతసేపో ఏడ్చింది. తనకు పిల్లలు లేరని రంగమ్మకు దుఃఖం. అప్పుడా బడిపంతులు వచ్చి రంగమ్మను ఓదారుస్తుంటే నలుగురూ నవ్వారు!

నవ్వారు - పెద్దగానే నవ్వారు.

'పిచ్చిముండకు పిల్లలు లేరని ఏడ్పు వచ్చిందట, ఆ పంతులుతో చెప్పుకొంటోంది చూచార్రా. ఏమివగలు!' అని చెప్పుకొంటూ ఏమి పకపకలు! ఏమి వికవికలు! అప్పుడు వాళ్ళల్లా నవ్వినా నాల్గువిధాల చెప్పుకొన్నా రంగమ్మ కళ్ళు తుడుచుకొని తల వంచుకొని తనదార్ని తాను వెళ్ళిపోయింది. కాని ఎవర్నీ ఏమీ అనలేదు. తనమూలంగా ఆ పంతులుకు మనఃక్లేశం కలిగిందికదా అనిమాత్రమే ఆమె బాధపడ్డది.

x x x

ఆనాడేకాదు ఏనాడూ రంగమ్మ ఎవరినన్నా ఏమన్నా అన్నా వాళ్ళయందు తనకు సానుభూతి ఉండో మరొకరికి ఉపకారం జరుగు తుందనో అన్నది కాని ఉట్టినే అనలేదు. సానుభూతిలేని సమయంలో అవసరంకాని పరిస్థితిలో ఆమె ఎవర్నీ ఏమీ అనేదికాదు. వారి వంక కన్నెత్తి చూడలేదు.

ఈనాడు ఆమె పరాయి మగవాణ్ణి రెక్కపట్టుకొని నడి వీథిలో నలుగురూ చూస్తుండగా నిర్భయంగా ఏమాత్రమూ సిగ్గుపడ కుండా ఆతన్ని త్రాగుబోతును పాప ఫలితాన్ని ఒడలంతా కన్పింపచేసుకుంటున్నట్లున్న మనిషిని నడిపించుకొని వెళుతుంటే అందరూ నవ్వుతున్నారనిగాని, తనవెనకే అనరాని అంతంత మాటలు అంటున్నారనిగాని ఆమె బాధపడరేదు. అసలు లెక్క చెయ్యలేదు.

'ఆ పడిపోయిన మనిషి - బుచ్చయ్య అసహ్యించుకోవలసిన

వ్యక్తే క్రితంలో అతను నడచినమార్గం మంచిది కాదు. అతని దురభ్యా సాలు క్షమింపదగ్గనీ కావు. మొత్తం మీద అతన్ని చూచి దుష్టుడను కోవడము సహజమే. కాని ఎత్తి పొడవడానికి వెక్కిరించి తొలగి పోవడానికిది సమయం కాదు. దారిద్ర్యంలో — ఒంటరిగాడై — దిక్కు లేనివాడై — నిస్సహాయస్థితిలో చావు బ్రతుకులమధ్య ఉన్నాడు. అతని పూర్వపు దుష్టగుణాన్ని చూచి అసహ్యించుకోవలసిందే ఎవరైనా.' అలా అనుకొనే రంగమ్మ కూడా కొంతసేపు ఛీదరించుకొన్నది. అతన్ని చూస్తూ అనేక విషయాలు ఆలోచించినది. అనేకము స్ఫురణకు తెచ్చు కొన్నది. తప్పుదారినపడి ఎక్కువకాలం అటే నడిస్తే మనిషి ఏ పరిస్థితికి వస్తాడో వచ్చాడో తెలుసుకొన్నది, అంతటి దుస్థితిలో మనిషిని ఏకాకిగా. రోడ్డు ప్రక్కపడి చచ్చిపోయే కుక్కలా — అసహ్యంగా చావనీయడము ఎంత అన్యాయమో దుస్సహమో అవగాహన చేసుకొన్నది. ఆమె మనస్సు నకు ఏదో విచిత్రమైన బాధ కలిగినది. అతనిపట్ల సానుభూతి కలిగింది.

అమె హృదయంలో అతనికి స్థానమేర్పడ్డది.

అమె అతన్ని నెమ్మదిగా నడిపించుకొని వెళ్ళి ఇల్లు చేర్చింది.

'మనుష్యులకు జబ్బులు వస్తాయి. ఆ జబ్బులు కొన్ని మంచివి కావు. అప్పుడు ఆ జబ్బుల్ని నిర్మూలింస్తాం కాని ఆ మనుష్యులను కాదుకదా? ఒకరకం జబ్బులకు ఒక ప్రత్యేక గుణాలుంటాయి. వానిని గుర్తించి నివారించేందుకు ఒక ప్రత్యేక ప్రావీణ్యమూ అనుభవమూ సంపాదించినవాడు కావాలి. అల్లాగే ఈ దుర్గుణాన్ని గుర్తించి వారించ డానికి హృదయ వైశాల్యము, క్షమాగుణమూ — మానవత్వమూ — మన స్తత్వ జ్ఞానమూ ఉన్న అనుభవజ్ఞుడు కావాలి. ఆ వ్యాధి నివారణ జరిగితే ఆ జబ్బు మనిషి మళ్ళీ మనిషి అవుతాడు. అంటే ఆ వ్యాధికి సంబంధించిన గుణాల్లో మార్పు తీసుకొని రావాలి. ఆ వ్యాధిగ్రస్తుల్ని చూచి ఛీదరించుకోవడమూ దూరంగా తొలగిపోవడమూ సామాన్యులు

చేసేపని అది ఇంకా నయం బాధపడుతున్న వ్యక్తి మీద ఒక రాయి వెయ్యడం క్రౌర్యం అవుతుంది. అల్లా చెయ్యడంవల్ల ప్రయోజనంలేదు. వైద్యుడు వ్యాధి నిర్మూలించడానికి ప్రయత్నిస్తాడు కాని అది ఒక పతితుడైన వ్యక్తికి వచ్చిచిందికదా అని మరింత చీదరించుకోడు. దొంగతనాలు జరుగుతుంటాయి. కొందరు దొంగలు పట్టు పడతారు. కొందరు పట్టుబడరు. ఒక స్థితిలో ఒక వాతావరణంలో ఒక బలహీనత, ఒకదుర్గుణంగలవాడు దొంగతనానికో-కాక జూదానికో-త్రాగుడుకో అలవాటు పడతాడు. దిగజారతాడు. ఆ వాతావరణంమార్చగలిగితే ఆగుణం బలహీనమై అట్టివిజరగకుండా పోవచ్చు. కేవలం పరిస్థితులవల్ల, వాతావరణం వల్ల ఒకరకంగా మారిన వ్యక్తిలో మరొక రకమైన వాంఛనీయమైన మార్పు పరిస్థితుల మార్పు వల్ల తీసుకొని రావడం సాధ్యం అవుతుంది.'

అలా సాగింది రంగమ్మ ఆలోచన.

రంగమ్మ ఇంటికి చేరినప్పటినుండీ ఈ విషయమే ఆలోచించడము మొదలు పెట్టింది. రెండు కాగులనిండా వేడినీళ్ళు పెట్టించి బుచ్చెయ్యకు ఒళ్ళు కడిగించింది. తానే స్వయంగా అన్నం పెట్టింది. బాగా గాలివచ్చే వెనుక వరండాలో ప్రక్క వేయించి అతన్ని అక్కడికి చేర్పించి పాలేరును తోడుపడుకోమన్నది. ఆ మరునాడే ఆలస్యం చెయ్యకుండా బస్తీకి బండి కట్టించుకొని అతన్ని తీసుకొనివెళ్ళి వైద్యం మొదలుపెట్టించింది. తొలినాడు ఆ వైద్యుణ్ణి అనేక ప్రశ్నలు అడిగింది. అనేక విధాల ప్రాధేయపడ్డది. ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన "ఇది ఏమంత ప్రమాదకరమైన పరిస్థితికాదు. ఊపిరితిత్తులు కొంచెం దెబ్బతిన్నాయి. అందువల్ల కాస్త జాగ్రత్తగా చూడాలి. చీడ అదీ త్వరలోనే తగ్గిపోతుంది. ఒక్క నెలరోజులు మంచి పోషణ ఉండి – అతన్ని పూర్వపు దుర్వ్యసనాల జోలికి పోకుండా

చేయగలిగితే అతనికి ఆరోగ్యం వస్తుంది. కావలసిన మందులూ—ఇంజక్షన్లూ నేను వాడతాను. పోషణ విషయం మీరు చూడండి" అని ధైర్యం చెప్పాడు. ఆ వైద్యుడు ఆమెకు తగిన ప్రోత్సాహం ఇచ్చాడు. ఆమెకు పట్టుదల కలిగింది

ఆయన మొదట నెలరోజులు చాలు అని మాటకు అన్నా వైద్యం మూడు నెలలు సాగింది. ఆమె మొదట్లో ఒకసారి ఇంటికి వెళ్ళి కావలసిన పైకం తీసుకొని కూతుర్నీ పెద్ద పాలేరునూ వెంటపెట్టుకొని తిరిగి బస్తీకి వచ్చింది. ఆ వైద్యుని ఆసుపత్రికి దగ్గరగా ఇల్లు తీసుకొని కేవలం అతనికోసమై ఆ యింట్లోఆ మూడు నెలలూ కాపరం పెట్టింది.

కావలసిన కట్టుదిట్టాలన్నీ చేసింది.

ఆమె అలా ఊళ్ళోకి వచ్చి డబ్బు పట్టుకొని పోయినప్పటినుంచీ ఊళ్ళో నలుగురూ రంగమ్మమీద మళ్ళీ దుష్ప్రచారం మొదలుపెట్టారు.

'దానికీ వీడికీ పూర్వ ప రి చ య ం లేకపోతే అది అంత సాయం ఎందుకు చేస్తుందిరా ?

మరో ఆడది ఎవరైనా ఇలా చేస్తుందిరా ?

అబ్బవంక చుట్టమనా అమ్మవంక చుట్టమనా ? చూస్తూ ఉండండి వాడు కా స్త కోలుకోంగానే వాడూ సరాసరి వచ్చి దీని ఇంట్లో మకాం పెడతాడో లేదో !, అనుకొన్నారు—అన్నారు. రంగమ్మ ఊళ్ళో లేదుకదా అని మరింత నిర్భయంగా పెద్దగా అన్నారు.

మనసబుగారు పనివేళా రంగమ్మ దగ్గరకు వచ్చి "వాణ్ణి చూచి పోదామని వచ్చా" అని గుమ్మంలో సాకుచెప్పి, లోనికి వచ్చి తాపీగా కూర్చుని "ఒసేవ్ రంగమ్మా నీ బాగుకోరి చెబుతున్నా – వాడు అసలు మంచివాడుకాడు. వాడితో నీకెందుకీ వ్యవహారం — నీకూ వెనకాముందూ ఎవరూలేరా. డబ్బు పాడుచేసుకోకు, పెద్దతనంలో ఇబ్బందిపడతావు. వాణ్ణి ఆ వెధవను బయటకు నెట్టేయ్" అని సలహా ఇచ్చారు. హితబోధచేశారు.

అమె ఆ సమయంలో ఏమీ పోట్లాడక పోవడం కనీసం అవును కాదుఅని వాదించక పోవడం చూచి. ఆయన తన మాటల ప్రభావం బాగా పనిచేస్తున్నదని భ్రమపడి, ఒకటికి రెండుసార్లు అక్కడికి వచ్చి కాసేపు కూర్చుని, రంగమ్మ కాఫీలు అందించి మర్యాదలు చేస్తే అంగీకరించి స్వీకరించి ఆ సలహానే పదిసార్లు చెప్పి వెళ్ళాడు.

"ఆహా ఏం పెద్దమనిషి తరహా-నామీద ఈయనకు ఎంతజాలి!" అని అనుకొని ఒక్క చిరునవ్వు నవ్వుకొని నేను ఒంటరిదాన్ని ఈయనతో వాదులాడి, దేనికి తగాదా పెంచుకోవడం అనుకొని నిగ్రహించుకొని ఊరుకొన్నది రంగమ్మ.

x x x

రోజులు గడిచినకొద్దీ మనిషి తేరు కొన్నకొద్దీ బుచ్చెయ్య ఒక రకంగా ఇరుకులో పడ్డాడు. కాస్త ఓపిక చిక్కేసరికల్లా మనస్సు ఒకసారి ఉరకలుతీసి, ఒకసారి కృంగిపోయి-పూర్వపు మార్గాలకు మళ్ళుతోంది. పూర్వపు సంగతులన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. తాను ఒంటరిగా అనుభవించిన బాధలన్నీ ఒకటివెంట ఒకటి స్ఫురణకు వచ్చాయి "ఇంత అభాగ్యుడు ఏం బ్రతక్కపోతే? అసలు ఆ విషయాన్ని ఎల్లా మర్చిపోగలిగాను? ఎందుకు మర్చిపోయాను? ఇంత చెడ్డపేరు వచ్చాక తిరిగి నేను తల ఎత్తుకొని తిరగడం ఎల్లాగా?"

ఎన్నో సమస్యలు అతనికి ఎదురైనాయి. మళ్ళీ అతనికి పరిష్కారమార్గం ఒక్కటే కన్పించింది. వెళ్ళి ఓచుక్క వేసుకొనివస్తే బాగుండు ననిపించేది. కాని రంగమ్మను తలచుకొన్నప్పుడల్లా అతని హృదయం గగ్గోలు పడుతుండేది.

'రంగమ్మ ఏం చిత్రమైన మనిషి'

తను అంటే ఆమెకు ఎంత సానుభూతి!

ఇన్నాళ్లూ తనకు దగ్గర ఉండి ఎంత ఉపచారంచేసింది! అంతలోనే ప్రపంచంపై, బ్రతుకుపై ఎంత మమకారం కలిగేలా చేసింది! ఎవరో పరాయిమనిషి. అందులో ఆడది. అయాచితంగా అకారణంగా తన్ను ఆదుకొని సుస్థితి కలుగజేసిందే. ఆనాడు చావు తప్పింది. ఈనాడు ఆరోగ్యం కుదుటపడి బలం చేకూరి, మళ్ళీ హాయిగా జీవించా లనే కోర్కె కలుగుతోందే!"

ఎప్పుడూ ఇల్లా ఆలోచించేవాడు బుచ్చెయ్య. ఇల్లా అనుకుంటూ అనుకుంటూ ఉండగానే ఒక్కసారి వెళ్ళి త్రాగివస్తే బాగుండు ననిపిం చేది. "ఆవిడకు తెలియకుండా వెళ్ళి త్రాగివస్తే—ఎంత తప్పు – ఎంత ద్రోహం" అనుకొనేవాడు. అలా అనుకొంటూనే ఎవరూ చూడకుండా అతను ఒకసారి బయటకు వెళ్ళి తాగివచ్చాడు. ఇక ఆ తర్వాత ఆవిడకు తెలియకుండా వెళ్ళి రావడానికి వీలు పడలేదు. ఆవిడ చాలా ఆంక్షలు పెట్టింది.

బుచ్చెయ్య ఒకరోజున అక్కడ నుంచి పారిపోదామనుకున్నాడు. నీకింత ఖర్చు పెట్టాను ఆ సొమ్ము తిరిగి ఇచ్చేయ్ అని అంటూందేమో నన్న భయంతో కాదు. కానేకాదు.

మనుష్యులు ఒక స్థితిలో మంచితనం కూడా సహించలేరు. మనిషి ఎక్కువ కాలం జైల్లోగడిపి బయటకువస్తే, హఠాత్తుగా లభించిన స్వేచ్ఛా వాతావరణాన్ని సహించలేడు. అల్లానే ఎక్కువ దుఃఖం అనుభవించి, క్షీణించిపోయి, అకారణంగా లోకులపై క్రోధం పెట్టుకొని, ఇతరులను మోసం చెయ్యాలని ప్రయత్నం చేస్తూ, దుర్వ్యసనాల్లోపడి తాను మోసపోతూ కాలం గడిపిన వ్యక్తికి కట్టుబాట్లతోటి జీవితం — ఆదరణచూపే విశాల హృదయం తాలూకు మంచితనం – వీటిముందు అతనికి ఎక్కువ సేపు నిలువ బుద్ధిపుట్టదు. ఆ కారణంగానే బుచ్చెయ్యకు

ఆవిడతో చెప్పకుండా ఎక్కడికైనా సరే వెళ్ళిపోదామని తరచు అనిపించేది.

కాని అతని హృదయం-ఆమెయెడల కలిగిన కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. తనకు అంత ఉపకారంచేసిన రంగమ్మకు అంతగా ఋణపడి, మోసపుచ్చి వెళ్ళిపోవడం ఇష్టం కాకపోయింది. అందువల్లనే అతనావిడ చెప్పుచేతల్లో ఉండిపోయాడు. మూడు నెలలూ ఇట్టే గడిచి పోయ్యాయి. అతన్ని వెంటపెట్టుకొని రంగమ్మ సంతోషంగా విజయ గర్వంతో స్వగ్రామానికి తిరిగి వచ్చింది.

x x x

బండిలో తిరిగి వస్తున్నప్పుడు దూరంగాకూర్చుని రంగమ్మవంక చూస్తూ "రంగమ్మా ఎందుకు నాకింత ఉపకారం చేశావ్" అని నెమ్మదిగా అడిగాడు బుచ్చెయ్య.

ఆవిడ సమాధానం చెప్పలేదు.

పది నిమిషాలపాటు ఎటో చూస్తూ ఉండిపోయింది రంగమ్మ. ఒకటి రెండుసార్లు "ఎందుకిలా చేశాను" అని తన్నుతానే ప్రశ్నించుకొన్నది.

అవును నేనెందుకు ఇతనికి సాయం చేశానూ ? అతను దుష్టుడు గదా.

అల్లా అని అందరూ, అయినవాళ్ళూ కానివాళ్ళూ అన్నారుగదా ! నాకు సలహాలు చెప్పారే !

అనతగ్గవాళ్లూ,అనతగనివాళ్లూ అందరూ ఆనాడు అతను దుర్మార్గుడనీ పతితుడనీ అన్నారుగదా !

ఆ స్థితిలో ఆ మాట వాస్తవమేకదా ! అటువంటివాటికి నేనెందుకు తోడ్పడ్డానూ !

ఆమెకే సరియైన సమాధానం స్ఫురించలేరు.

ఆమె ఆలోచనలో పడ్డది.

ఆనాడు అతన్ని అంతటి దురవస్థలో చూచినప్పుడు అతనింక ఎన్నాళ్లో బ్రతకడనీ కాసేపూ, దైవం అనుకూలిస్తే బ్రతికి బట్టకడితే మంచిమనిషిగా మారగలడని కాసేపూ అనుకొన్నది. బ్రతక్కపోయిన పక్షంలో కూడా నా అన్న వాళ్ల లేకుండా అలా రోడ్డుమీద చావడము అసహ్యమనిపించింది. అతన్ని ఏదోవిధంగా తిరిగి మనిషిని చెయ్యా లనుకొన్నది. పోనీ తన ప్రయత్నం పూర్తిగా ఫలించకముందే మధ్యలో అతను పోయినా మనిషిలాపోతే అదోతీరు" అనుకొన్నది. అందువల్లనే అతనికి సాయపడ్డది. నిజానికి అదే ఆమెకు సమాధానం కావలసింది. ఆమె కావిషయం స్ఫురించినట్లే అనిపించింది కాని "అల్లా అనుకొని ఉంటానా! ఏమిటి ఇతనొకవేళ బ్రతికి బాగుపడితే మాత్రం నాకేం ఒరుగు తుందనుకొన్నానా ! లోకం అంతా దుష్టుడు నీచుడు అని కోడై కూస్తున్నప్పుడు ఆ వ్యక్తి ఉంటే ఏం-ఊడితేనేం అని నేనూ ఎందు కూరుకోలేదూ ! ఇప్పుడు మాత్రం నాకేమిటి సంబంధం అతనితో?" అలా ఎన్నో ప్రశ్నలు. నిజంగా సమాధానం దొరకలేదు.

అతను మళ్ళా అడిగినట్లే చూచాడు.

ఆమె అతనివంక ఒక్కసారి మధురంగా చూచింది. ఆ చూపులో కరుణ ఉన్నది. సానుభూతి ఉన్నది. ఆప్యాయత ఉన్నది. ప్రేమ ఉన్నది. ఆమె ఏదో సమాధానం చెప్పినట్లే అనిపించింది బుచ్చెయ్యకు.

దారిలో ఎక్కువసేపు మౌనమే గడిచింది.

అతనే ఒకటి రెండు సార్లు సంభాషణ ఆరంభించాడు. తన కృతజ్ఞతకు సూచకంగా తన పెంకుటిల్లు తక్కువ ధరకు ఆవిడకు అమ్మ చూపాడు. "నువ్వు కొనుక్కోవమ్మా ఎల్లాగో దాన్ని అమ్మివేద్దామనే ప్రయత్నం చేస్తున్నాగా. మాదీ పల్లెటూరైనా బస్తీకి దగ్గరలో ఉంది గనుకబాగా అద్దెవస్తుంది. నువ్వు కొనుక్కో -

ఏమంటావ్ రంగమ్మా - అని అడిగాడు. ఆ మాటలు విని "ఎందుకమ్మే స్తున్నావ్" అని అడిగింది రంగమ్మ. అప్పులు తీర్చేసి మరో ప్రాంతానికి పోయి ఎవరి పొలమైనా చేసుకొని బ్రతుకుదామను కొంటున్నాననీ-ఇంకనుండి తాను న్యాయంగా బ్రతుకుతాననీ సమాధానం చెప్పాడతను. "సరిగా బ్రతకాలని ఉంటే ఎక్కడికో పోవడం దేనికయ్యా నా పొలం చేద్దువుగాని రా-అప్పులు నే తీరుస్తాను" అన్నది. అతన్ని సమాధానపరచి ధైర్యం చెప్పింది. అతన్ని వెంటపెట్టుకొని ఇల్లు చేరింది రంగమ్మ.

అప్పులు తీరుస్తానని ఊరికే అనడంకాదు. ఇంటికిచేరి కాస్త స్థిమిత పడంగానే పాలేరుచేత కబురుపెట్టి ఆయా పెద్దలను పిలిపించి ఆ వ్యవహారమంతా అణాపైసలతో సహా సరిచూచింది.

రోజులు గడచిపోయాయి.

x x x

బుచ్చెయ్య ఒకరోజున "రంగమ్మా నీకు నేను చాలా ఋణపడ్డాను. నీ రుణం ఎట్లా తీర్చుకొంటాను. పడిపోయిన మనిషిని లేవదీశావు.. నాకు సరిగా బ్రతకమని మరోజన్మ కల్గించడమే కాక ఋణవిముక్తుణ్ణి చేసి స్వేచ్ఛనిచ్చావు. ఇదిగో నువ్వు కాదనవద్దు ఆ యిల్లు నీపేర వ్రాసేస్తాను." అంటూ తన హృదయంలో ఉన్న కృతజ్ఞతను చూపబోయాడు. ఆమె "నాకెందుకయ్యా నీ యిల్లు అంత తీర్చాలని ఉంటే నాపొలం చెయ్యమన్నాగదా ఈఏడు చెఱకువేసి వ్యాపారంచెయ్యి. లాభంవస్తే అప్పు తీరుద్దువుగాని" అంటూ కొత్త పథకం వేస్తూ అతని వంక ఆపేక్షగా చూచింది.

అతని హృదయం కృతజ్ఞతతో-అతనికన్నులు అశ్రువులతో నిండిపోయాయి. ఒకవింత ఆవేశం కలిగింది. జీవితంపై ఒక వినూత్న

మైన ఆశకలిగింది. ఆనందం కలిగింది. అదంతా కలిసి ఒక విచిత్రమైన అనుభూతిలా అనిపించింది. ఆమెకు నమస్కారం చేద్దామనిపించింది. సాష్టాంగపడి కనీసం ఆమెపాదాలను తాకుదామనిపించింది బుచ్చెయ్యకు. అతను ఆపని చేసేవాడే కాని రంగమ్మ అంతలో మొహం మరోవైపుకు తిప్పుకొని కొంచెం తొందరగా లోపలకు వెళ్ళిపోయింది.

అతనామె ఇంట్లో మరి కొంతకాలంపాటు ఉండిపోయాడు.

x x x

రంగమ్మ పొలంచేస్తూ, ఆ యింటి వ్యవహారాలు చూచి పెడుతూ, ఆయింట్లో అతను ఇంటిమనిషిలా మెలగుతూ పాలేళ్ళపైన అధికారం చెలాయిస్తూ,మంచి మనిషిలా వ్యవహరిస్తూ, పూర్వపు జీవితాన్ని మరచి పోతూ — భావి జీతాన్ని గూర్చి తలపోస్తూ రెండేళ్ళు ఉన్నాడు. ఆ రెండేళ్ళల్లో అతను నిండైన మనిషి అయ్యాడు. వైద్యం చేయించుకొని వచ్చిన క్రొత్తల్లో మరీ బక్కపల్చగా ఉన్నా రెండేళ్ళ అనంతరం కొంచెం బాగానే ఒళ్ళుచేశాడు.శుచీశుభ్రత నేర్చుకున్నాడు. శరీరంనునుపు తేలింది. మనస్సు తేలిక పడింది. తలదువ్వుకొని మంచి బట్టలు—నీరు కావి ధోవతీ, స్వయంగా ఉతికి ఆరవేసుకొన్న కాలరు చొక్కా, కండువాలా కన్పించే పెద్ద గళ్ళ తువ్వాలా వేసుకుంటే అవి అతనికి ఒక క్రొత్తరకమైన అందాన్ని చేకూర్చాయి.

అతని కళ్ళల్లో పూర్వం ఉండే ఆ మత్తూ, ఆభయమూపోయాయి. ఆ మనిషి స్థిమిత పడ్డాడు.

అతను కాస్త తేరుకొని మామూలు మనిషిగా మారి రంగమ్మ పొలంచేస్తున్న క్రొత్తరోజుల్లో మునసబుగారి మనుష్యులు వెనకగా వెక్కిరిస్తూనే ఉన్నారు. "అరెరె ఎవఁడ్రావాడు" అని ఒకడు అడగడమూ "వాడా వాడేరా అల్లదే కొన్నాళ్ళ తప్పతాగి లోకులు సొమ్ము ఎగగొట్టి జైలుకు పోయొచ్చాడేవాడే!ఇప్పుడు మరోదార్ని పడ్డాడు—రంగమ్మ బాగా

మేపేస్తున్నదేమో-వళ్ళుచేసింది గిత్త"-అని రెండోవాడు సమాధానం చెప్పడమూ-ఇక ఆ యిద్దరుకలసి ఏదో అనుకొని పగలపడినవ్వడమూ-ఇల్లా జరుగుతుండేది.

అప్పుడతనికి ఒడలు కంపరం ఎక్కేది.

'ఎల్లాగో మనం బాగుపడి చచ్చేదేముందిలే. ఒక్కసారి మళ్ళీవెళ్ళి కడుపునిండా 'నీరు' పుచ్చేసుకొని వచ్చి వాళ్ళకు మంచి నిషాలో కన్పించాలి. అల్లా వచ్చి వాళ్ళను నిలవెయ్యాలి' అనుకొనేవాడు. ఇప్పుడు తనొక్కడూ ఆ మనుష్యుల్ని కనీసం ఓ నలుగుర్ని నిలవేసి కొట్లాట వచ్చినా సరియైన సమాధానమే చెప్పగలడు. చెప్పాలనే కసిగా ఉండేది. కాని అంతలో రంగమ్మ గుర్తుకువచ్చేది. ఆమె మధుర మందహాసము మెరపులా మనస్సులో ఒకసారి తళుకుమని మాయమయ్యేది. అంతలో అతని మనసు మారేది. అతను బలవంతంగా ఓ చిరునవ్వు పెదిమలపై మలచుకొని గుర్తుకురాని ఏదో పదం అందుకోవాలని ప్రయత్నం చేస్తూ ముందుకు సాగిపోయేవాడు.

x x x

రంగమ్మ అంటే బుచ్చెయ్యకు ఒక విచిత్రమైన ఆకర్షణ ఏర్పడ్డది. హృదయంలో ఇది అది అని చెప్పడానికి వీలుగాని భావమొకటి స్థిరపడి పోయింది. ఆమెకానాటి కానాటికి ఋణపడిపోతున్నాననే బాధ ఎక్కువయ్యింది. ఆమెయందు విశ్వాసం కలిగింది. ఆ రెండేళ్ళూ కష్టపడితే చెరుకుమీద రెండువేలు లాభం వచ్చింది. డబ్బు తనచేతిమీదగా తిరిగినా అతను స్వంతానికని ఏమీ వాడుకోలేదు. నా అప్పులు తీర్చిన సొమ్ము తిరిగి ఆవిడకు నేనీవిధంగా ఇవ్వగలిగానని అనుకోవచ్చు అని బుచ్చెయ్య మనసులో సంతోషపడ్డాడు. "మరి నీవాటా నువ్వు తీసుకోవేం" అని రంగమ్మ అడిగినప్పుడు 'నా మొహం నాకు వాటా ఏమిట'ని తప్పుకొని పోయాడు.

ఆమెకు పనిపాటల్లో సాయపడదామని ఎంతో ప్రయత్నంచేశాడు. ఆమెకు వ్యక్తిగతంగా లాభించే పనిలో సాయపడి ఆమెకు కొంత సంతోషం కలిగిద్దామని అతని ప్రయత్నం. కాని ఆ ప్రయత్నం కొన సాగలేదు.

అతనితో మితంగా మాటాడేది రంగమ్మ. మాటాడిన ఆరెండు మాటలూ మధురంగా ఉండేవి. అల్లా మాటాడుతూనే ఆవిడ అతనికి పనులు పురమాయించేది. అతను సంతోషంగా చేసేవాడు "ఇదుగో బుచ్చెయ్యా కాస్త ఈ ఉపకారం చెయ్యి-ఆవుదూడకు జబ్బు చేసింది. దాన్ని ఆస్పత్రికి తోలుకుపోయిరా నీకు పుణ్యం ఉంటుంది" అని ఒక రోజున. 'ఇదుగో చూశావ్ ఈ పాలు పట్టికెళ్ళి మన అంకిరెడ్డి ఇంట్లో ఇచ్చిరా ఆయన కొడుక్కు పాలు చాలడంలేదట. అరె మరచాను ఆ బొప్పాసికాయలు కూడా నాలుగు పట్టికెళ్ళి ఇవ్వు. తల్లికి కాస్త పాలు పడతయ్యేమో!' అని మరో రోజు.

"చలికాలం వచ్చిందిరా ఆ పిల్లలు ఏం బాధపడుతున్నారో ఏమో ఇదిగో ఇవికాస్త మల్లన్నకిచ్చిరా" అని కుట్టించిన చొక్కాలూ, చేత్తో కుట్టిన గౌన్లూ, చొక ఊలుతో అల్లిన స్వెట్టర్లూ అందించేది మరో రోజున.

అతని ముఖంలో కాస్త అయిష్టత కన్పిస్తే "బాబ్బాబు నీకు పుణ్యముంటుంది. ఈ కాస్త సాయం చేసిపెట్టు" అని ప్రాధేయపడి బ్రతిమాలుకొనేది.

ఇవేంపనులు. తనకు ఇది పెద్ద సాయమా! ఇదుగో నాకిదికావాలి. మామిడిపళ్లు దొరకని కాలంలో - అవి ఆ గ్రామంలోకి సరిగా రాని కాలంలో—"నాకు ఫలానా పళ్లు అంటే ఇష్టం పోయి ఆ ఇమాం పసందులు సంపాదించుకొనిరా-అదుగో మునసబుగారి భార్య పెట్టుకొని తిరుగుతుందే ఆ రకం నెక్లేసు చేయించుకొనిరా-పోనీ కనీసం నాకా చీర

పట్టుకొనిరా" అని అడగదేం అనుకొనేవాడు బుచ్చయ్య

"అల్లాంటి పన్లు చేయమంటే ఎన్ని అడ్డంకులు ఉన్నాసరే వెళ్ళి సాధించుకొని వచ్చి ఆమె పాదాలముందు పెట్టగలను. అప్పుడామెకు ఆనందం కలుగగలదు." అనుకొనేవాడు. కాని అల్లాంటి కోరికలు ఆమెకు లేవు. అందుకే అల్లాంటి పనులు అతను చెయ్యడానికి అవకాశం లేక పోయింది.

"పోనీ ఆయనగారు ఇంకా విరోధీలా అల్లా మాటాడుతూనే ఉన్నారు. కాస్త వారి వ్యవహారం చూడమని అనగూడదూ. కసితీర్చుకో కూడదూ. అల్లా అని మాట సామెతకైనా అనదాయె. అంటేచాలు వాడి పని పట్టేవాణ్ణి. 'నిండా మునిగిన వాణ్ణి నాకేమిటి భయం" అనుకొనే వాడు. కాని అల్లాంటిదేమీ జరగనేలేదు. ఏదో మాటల సందర్భంలో కాస్త తీరుబడిగా ఉన్నప్పుడు "చూశావా రంగమ్మా - ఆయనగారు ఏమన్నారో"అని చెప్పబోతే ఎప్పుడూ ఒకటేమాట" అంటే అన్నారులే ఆ పాపం వాళ్ళకే ఉంటుంది" అని ఆ ప్రస్తావన మానిపించేది.

బుచ్చెయ్యా, పెద్దపాలేరూ వెనుక వరండాలో ప్రక్కలు వేసు కొనేవారు. ఆ పాలేరు బుచ్చెయ్యకు పెద్ద పట్టె మంచంమీద ప్రక్క దులిపివేసి కప్పుకొనే శాలువా కాళ్ళదగ్గర పెట్టి కాస్త దూరంలో కంబళీ వేసుకొని పడుకొనేవాడు. ఇక ఆ రాత్రి నిద్రపట్టేవరకూ అతనితోనే మాటాడుతూ ఉండాలి. బుచ్చెయ్య కాస్త కదిలి-లేచి అల్లా బయటకువెళ్ళ బోతుంటే "ఏడకు బుచ్చెయ్యా?" అని అతను అడగవలసిందే, ఇతను సమాధానం చెప్పవలసిందే.

అల్లా గడిచినాయి రోజులు—నెలలు. అతనికి పరాయిచోటున ఉన్నట్లే అనిపించలేదు. రోజులు గడుస్తున్నట్లే అనిపించలేదు.

x x x

ఊరివారు మామూలు ధోరణిలో ఏమేమో అంటూనే ఉన్నారు

చాటుగా. "అదృష్టం అంటే అల్లా ఉండాలిరా పద్దా పన్నీటిలో పడ్డాడు. మెల్లగా రంగమ్మను మచ్చిక చేసుకొన్నాడు. అన్నీ సమకూరు తున్నాయి. ఎంత వెనకేసుకుంటున్నాడో!" ఇల్లా అంటూనే ఉన్నారు. అయితేపూర్వమంత స్వేచ్ఛగా అనడంలేదు.అందుకుకారణాలుఉన్నాయి. మునసబుగారు ఈ విషయాల్లో పూర్వమంత శ్రద్ధవహించడంలేదు. ఆయనంతట ఆయనే రంగమ్మ ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్ళడం చేతా, ఆవిడ విషయంలో ఆయనకు ఒక క్రొత్త ఆసక్తి, ఆకాంక్ష కలగ డంచేతా రంగమ్మ ప్రసక్తి వచ్చినప్పుడు పూర్వమంత ఎక్కువగా కటువుగా విమర్శించడంలేదు. అదొక కారణం. అదీ గాక అతని ఎదుట పడిగానీ_అతనికి వినపడే లాగున కానీ ఏమైనా అంటే అతను తిరగబడి కొట్టగలడనే భయం ఏర్పడింది కొందరికి. మరికొందరికి ఆమె ప్రాపకం పోగొట్టుకోవడం, అంత ఇష్టమైన విషయంగా కనిపించలేదు.అదిమరొక కారణం మునసబుగారు వస్తుంటే రంగమ్మ ఆటంకం చెప్పడంలేదిప్పుడు. ఆ రావడంలో ఆయన దృష్టి ఎటువంటిదైనా ఆమె దృష్టి మాత్రం చాలా చిత్రమైనది. అటువంటి మనిషిని కూడా క్షమించగలగడమే ఒక విచిత్రము. క్షమించడమేగాక ఆయనతో గౌరవంగా ఆదరంగా మాటా డమమరొక చిత్రము. మొదట్లో అవకాశం దొరికినప్పుడు ఆమెతో పరిహాసా లాడాలనీ, ఏదో కొంటెమాట అనాలనీ ప్రయత్నం చేశారు. కాని అటువంటివి ఒకటి రెండుసార్లు జరిగినా రంగమ్మ మాట మార్చేస్తూ ఒకసారి ఆయన వంక బాధగా చూచేది. ఆ చూపు ఎదుటివాని హృదయంలో సూదిలాగ్రుచ్చుకొని పొయ్యేదిలా ఉండేది. మునసబుగారు అనుకోకుండానే ఆమెకు దగ్గరగా_సన్నిహితుడులా మెలగడం జరిగింది. అంతదగ్గరగా ఉండి_సన్నిహితుడుగా ఉండి ఆమెను పరిశీలించేసరికి ఆయన మనస్సు మారింది.

ఆమె ఎప్పుడు మాటాడినా "అబ్బాయ్ పెళ్ళి ఎప్పుడూ? మీ పెద్ద

శ్రీకాకుళం



మ్మాయిని పురిటికి తీసుకొని వస్తారా!" ఇవే విషయాలు, కొద్దికాలంలో అయన కూడా తన కష్టసుఖాలు ఆమెతో చెప్పుకోవడం ఆరంభించారు.

"ఇంకేం ఇద్దర్నీ ఇంట్లోనే కట్టేసేలాగుంది! లోకం నోరు మూయించడానికి ఆయన్నికూడా మంచి చేసుకొంటోంది." అనుకోవడం మొదలుపెట్టారు జనం. 'ఇంక వాడు-ఆ బుచ్చెయ్య ఎక్కడికి పోతాడ్రా ఆవిడ ప్రాపకం దొరికిందాయె. ఆయనేమో దాదాపు వారి పక్షమే చేరారాయె. ఇంక వాడికేం భయం.ఇక్కడే స్థిరంగా ఉండిపోతాడు, అని చెప్పుకొంటున్న జనానికి బుచ్చెయ్య - రంగమ్మ మాటమీద మనువు నిశ్చయం చేసుకొని ఊరువదలి వెళ్ళిపోయేడానికి సిద్ధపడేసరికి ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగింది.

X X X

ఆ మనువు రంగమ్మే నిశ్చయం చేసింది.

పెట్టవలసిన సొమ్ములన్నీ ఆమే చేయించి సిద్ధపరచి వెళ్ళేటప్పుడు అతని చేతికి ఇచ్చింది. పెండ్లిఖర్చులకని కొంత రొఖ్ఖంకూడా ఇచ్చింది.

కావలసిన ప్రోత్సాహం అంతా ఇచ్చి అతన్ని పంపుతూ "ఓయ్ బుచ్చెయ్యా నువ్వుమాత్రం ఒక విషయం జ్ఞాపకం ఉంచుకో ఎవరో ఏదో అన్నారని రోషపడి మళ్ళీ తగాదాల్లోకి పోకు-అంటే అన్నారు. తలవంచుకొని వెళ్ళిపో-అనడానికి అందరికీ అధికారం ఉందని కాదు నేనడం. అనేవాళ్ళల్లో కొందరు అనతగ్గవాళ్ళూ ఉంటారు. వాళ్ళు అన్నా, మనం పడ్డా మనకింతలో వచ్చేసిన నష్టం ఏమీలేదు. నువ్వు మాత్రం సుఖంగా బ్రతకడం నేర్చుకో" అంటూ ఎన్నో చెప్పి పంపింది.

అతనికి ధైర్యం చెప్పింది. కాని అతను తీరా వెళుతుంటే గుమ్మంలో నిలబడి – "ఏం బుచ్చెయ్యా నిజంగా వెళ్ళుతున్నావా?" అని కంట తడి పెట్టింది.

ముందు రెండు రోజులు నుంచీ అతను వెళ్ళడానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేసింది. అతనికి క్రొత్తబట్టలు పెట్టి అవి కట్టుకొనేదాకా ఊరుకోలేదు—వెళ్ళి ఏమేమి ఎల్లా చేయ్యాలో అన్నీ చిన్నపిల్లవాడికి చెప్పి నట్లుగా చెప్పింది.కాని తీరా వెళ్ళబోయేముందు ఆమె కంటతడి ఎందుకు పెట్టిందో బుచ్చెయ్యకు సమంగా అర్థంకాలేదు.అతను ఆమెవంక ఆపేక్షగా చూస్తూ "వెళ్ళొస్తా" అన్నాడు.అతనికన్నులలోనూఅప్రయత్నంగా అతనికే తెలియకుండా నీళ్ళు తిరిగాయి.

ఆమె కన్నీరు పొర్లి జారిక్రింద పడకముందే పమిట కొంగుతో అద్దుకొని, చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ "అది సరేగాని బుచ్చెయ్యా—ఇకముందునీ బాగు ఒక్కటే చూచుకొంటే కాదు. మేన కోడలికి మంచి మనువు చూడాలి" అన్నది రంగమ్మ "ఆ సంగతి నీకెందుకు బెంగ—నేనుండగా" అన్నాడు బుచ్చెయ్య అదొక్కటే ఋణం తీర్చుకోవడానికి మార్గం అని అనుకుంటూ.

కథా నిలయం
5387
శ్రీకాకుళం